తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice  వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

18-08-2026

మంగళవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 191

PUBLISHED FROM HYDERABAD  పేజీలు-8  వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక
సిరి
People's Voice
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575




# సామాన్యుడిపై

# 22(ఎ) గుదిబండ!

- భూభారతి పోర్టల్ ద్వారా ప్రజల సొంత ఆస్తులు నిషేధిత జాబితాలోకి..
- ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే మార్పు రాష్ట్రంలో 91 లక్షల పైచిలుకు ఎకరాల ప్రైవేటు భూములు జాబితాలోకి..
- ప్రభుత్వ భూముల పక్కనున్న ప్రైవేట్ స్థలాలకూ గ్రహణం
- రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల్లో లక్ష ఎకరాలు బంద్
- గ్రేటర్‌లో కాలనీల గగ్గోలు
- వేల కోట్ల విలువైన అపార్ట్‌మెంట్లు, ఇళ్లు, ప్లాట్లు అమ్మడానికి వీల్లేక ఇబ్బందుల్లో ప్రజలు
- రాష్ట్రంలో 4,567 గ్రామాల్లో 4.95 లక్షల ఎకరాల్లో తేలని సరిహద్దు వివాదాలు

## ధరణి డిజిటలైజేషన్ సమయంలో ఆపరేటర్ల తప్పుడు నమోదు

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్**

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రజల సౌకర్యార్థం తీసుకొచ్చిన భూభారతి విధానంలో ప్రజల సొంత ఆస్తులనే నిషేధిత జాబితాలో పెట్టడం లక్షలాది మంది సామాన్యుల పాలిట పెద్ద సమస్యగా పరిణమించింది. అప్పటివరకు తమదనుకున్న ఆస్తిని నిషేధిత జాబితాలోకి చేర్చి, అది మీదేనని నిరూపించుకోమంటే సామాన్యుడు తన గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. దశాబ్దాలుగా అనుభవిస్తున్న ఆస్తులను అమ్ముకోకుండా రకరకాల సాంకేతిక కారణాలు చూపుతూ, కనీసం ముందస్తు నోటీసులు కూడా ఇవ్వకుండా ప్రభుత్వం 22(ఎ) జాబితాలోకి చేర్చడంపై ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. 1908 భూచట్టం ప్రకారం 22(ఎ) కింద ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ, ల్యాండ్ సీలింగ్, మిగులు భూములతో పాటు కోర్టు వివాదాల్లో ఉన్న భూములను నిషేధిత జాబితాలో చేర్చాల్సి ఉంటుంది. కానీ అధికారులు సమర్పించిన నివేదికల్లోని తీవ్ర వ్యత్యాసాలు, గందరగోళం సగటు జీవి ఆగ్రహానికి ప్రధాన కారణమవుతున్నాయి.

**ప్రైవేట్ భూములకూ గ్రహణం**

శాఖాపరంగా అధికారులు అందించిన నివేదికల ప్రకారం తెలంగాణలో కోటి ఆరు

మిగతా 2లో..



కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్

## కొనసాగిస్తాం

2



రుణమాఫీపై మాట్లాడే నైతికత

## బీఆర్ఎస్‌కు లేదు

- రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- తొలి పంటకాలంలోనే రూ.2 లక్షలలోపు రుణాల మాఫీ
- రూ.20,616.89 కోట్లతో ఏకకాలంలో పంట రుణమాఫీ
- 25,35,964 మంది రైతులకు రుణమాఫీతో లబ్ధి
- బీఆర్ఎస్ హయాంలో వాయిదాల రుణమాఫీతో రైతులపై వడ్డీ భారం
- రూ.2,630 కోట్ల వడ్డీ భారం మోపిన గత ప్రభుత్వ విధానాలు

2

## అంత సీరియస్ అయితే ఇన్నాళ్లూ ఎందుకు మౌనంగా ఉన్నారు?

- రాహుల్ ఆస్తుల కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- సీబీఐ, ఈడీని ప్రశ్నించిన జస్టిస్ బాగ్చి
- అంత తీవ్రమైన ఆరోపణలైతే ఏం చేశారు?
- కోర్టు ఆదేశాల కోసం ఎందుకు ఎదురుచూశారు?
- సుమోటోగా చర్యలు తీసుకున్నారా? అని ప్రశ్న
- అలహాబాద్ హైకోర్టు విచారణకు సుప్రీం బ్రేక్
- సీబీఐ, ఈడీ నివేదికలు సమర్పించొద్దని ఆదేశం
- ఆగస్టు 20న హైకోర్టు విచారణ వాయిదా

**నేషనల్‌బ్యూరో, (సిరి న్యూస్):**

రాహుల్ గాంధీపై వచ్చిన అక్రమాస్తుల ఆరోపణలు అంత తీవ్రమైనవైతే ఇప్పటివరకు కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ వ్యవహారంలో కోర్టు ఆదేశాల కోసం ఎందుకు ఎదురుచూడాల్సి వచ్చిందని సీబీఐ తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వీ. రాజును

మిగతా 3లో..



పరిశ్రమలు-విద్యార్థులను అనుసంధానించే

## దేశంలోనే తొలి జాబ్ పోర్టల్

- పరిశ్రమలు, విద్యార్థులను నేరుగా కలిపే పోర్టల్
- ముప్పిరెడ్డిపల్లిలో జాబ్ పోర్టల్ ప్రారంభం
- మంత్రి వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా ప్రారంభం

2





## పాత వాహనాలకు ఈ10 పెట్రోల్ ఇవ్వాలి

- ఇథనాల్ కలిపిన పెట్రోల్‌పై దేశవ్యాప్తంగా చర్చ
- పాత వాహనాల కోసం ఈ10 అందుబాటులోకి తేవాలి
- సీఈఏ అనంత నాగేశ్వరన్ కీలక సూచనలు
- బీఎస్-4కు ముందు వాహనాలు 7.5–8 కోట్ల వరకు
- అధిక ఇథనాల్‌తో ఇంజిన్‌పై ప్రభావం ఉండొచ్చు
- పాత రబ్బరు భాగాలపై ప్రతికూల ప్రభావం

2



వంట గ్యాస్ వినియోగదారులకు

## శుభవార్త..

- ఎల్పీజీ ఈకేవైసీ గడువు పొడిగింపు
- ఆగస్టు 23 వరకు అవకాశం
- వినియోగదారులకు ఊరట కలిగించే నిర్ణయం
- సర్వర్ సమస్యలతో ఈకేవైసీకి బ్రేక్
- యాప్‌లు పనిచేయక వినియోగదారుల అవస్థలు
- గంటల తరబడి కేంద్రాల వద్ద నిరీక్షణ
- ఫేషియల్, వేలిముద్రల ధృవీకరణలో ఇబ్బందులు
- డిజిటల్ సిస్టమ్స్ నిలిచిపోవడంతో సేవలకు ఆటంకం
- గడువు పెరిగినా తప్పని సాంకేతిక సమస్యలు

**హైదరాబాద్, (సిరి న్యూస్):**

ఎల్పీజీ కనెక్షన్ వినియోగదారులకు ప్రభుత్వం ఊరటనిచ్చే వార్త అందించింది. ఈకేవైసీ (eKYC) ప్రక్రియను పూర్తి చేయడానికి నిర్దేశించిన గడువును ఆగస్టు 16 నుంచి ఆగస్టు 23 వరకు పొడిగించారు. సర్వర్ సమస్యల వల్ల లేదా సమయం లేక ఇప్పటివరకు ధృవీకరణ పూర్తి చేసుకోని వారికి ఇది నిజంగా శుభవార్త. అయితే ఈ గడువు పెంపు కొంత వెసులుబాటును ఇచ్చినప్పటికీ, క్షేత్రస్థాయి సాంకేతిక అవస్థల వల్ల పౌరుల ఇబ్బందులు పూర్తిస్థాయిలో తొలిగిపోలేదు. గడువు పొడిగించినప్పటికీ సర్వర్ సమస్యలు వినియోగదారులను తీవ్రంగా వేధిస్తున్నాయి. ఒక్కసారిగా డిజిటల్

మిగతా 3లో..




## సైలెన్సర్ మార్చితే

## కేసు తప్పదా?

- మోత మోగితే మోటార్ బైక్ సీజ్?
- భారీ శబ్దం చేస్తే ఎంత జరిమానా?
- మాడిఫైడ్ సైలెన్సర్లపై పోలీసుల కొరడా
- బండి సీజ్ చేసే నిబంధనలు ఏంటి?
- యువతకు పోలీసుల కీలక హెచ్చరిక
- నిబంధనలు ఉల్లంఘిస్తే ఇక కఠిన చర్యలు

**హైదరాబాద్, (సిరి న్యూస్):**

ఖమ్మం నగరంలో ట్రాఫిక్ పోలీసుల వాహన తనిఖీలపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనం నంబర్ TS 07 HG 8712ను మ్యాంగో ట్రీ హోటల్ ఎదురుగా పార్క్ చేసి ఉండగా.. ట్రాఫిక్ కానిస్టేబుల్ దానిని నెట్టుకుంటూ తీసుకెళ్లారని వాహనదారుడు ఆరోపిస్తున్నాడు. హోటల్ సిబ్బంది సమాచారం ఇవ్వడంతో అక్కడికి వెళ్లి వాహనాన్ని ఎందుకు తీసుకెళ్తున్నారని ప్రశ్నించగా.. తాళాలు ఇవ్వాలని, లేదంటే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని బెదిరించినట్లు

మిగతా 2లో..

## సర్కార్ నడుపుతున్నవా.. లేక

## సర్కస్ నడుపుతున్నవా



**హైదరాబాద్, (సిరి న్యూస్):**

రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి విమర్శలు గుప్పించారు. మీ తప్పులకు ప్రభుత్వ అధికారులు బలి కావాలా? తప్పు మీరు చేస్తే శిక్ష వారు అనుభవించాలా? సర్కార్ నడుపుతున్నవా.. లేక సర్కస్ నడుపుతున్నవా రేవంత్ రెడ్డి? అని నిలదీశారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను బంద్ చేయాలనే కుట్ర బయటపడటంతో ఆ తప్పును అధికారులపైకి

మిగతా 3లో..

- మీ తప్పులకు అధికారులు బలి కావాలా? : హరీశ్ రావు
- సర్కార్ నడుపుతున్నవా.. సర్కస్ నడుపుతున్నవా రేవంత్ రెడ్డి?
- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌పై కుట్ర ఏంటి?
- తప్పును అధికారులపైకి నెట్టే ప్రయత్నం: హరీశ్ రావు
- 22ఏ భూముల వ్యవహారంలో భూదందా ఆరోపణలు
- 'సారీ' చెప్పి తప్పించుకుంటే సరిపోదు: హరీశ్ రావు
- పొన్నం, పొంగులేటి వీడియోలను ఎక్స్‌లో షేర్ చేసిన మాజీ మంత్రి
- ప్రజా జీవితాలతో ముడిపడిన అంశాల్లో నిర్లక్ష్యంపై మండిపాటు
- మంత్రుల తీరుపై సీఎం రేవంత్ రెడ్డిని ట్యాగ్ చేసిన హరీశ్ రావు
- ప్రభుత్వ తప్పులకు అధికారులను బాధ్యులను చేయొద్దని డిమాండ్

ఇరాన్ అణుబాంబుపై

## ఫేక్ పోస్టు..

- ఇజ్రాయెల్, అమెరికాలో కలకలం!
- ఎక్స్‌లో వైరల్ అయిన ఓ పోస్టుతో మొదలైన గందరగోళం
- ఇరాన్ అణ్వాయుధాలపై ఐఆర్‌జీసీ కమాండర్ వ్యాఖ్యలంటూ ప్రచారం
- కమాండర్ ఫొటోతో ఏఐ రూపొందించిన అణు పేలుడు చిత్రం
- ఇజ్రాయెల్ మీడియా కథనాలతో మరింత ఉధృతమైన ప్రచారం



2

# రుణమాఫీపై మాట్లాడే నైతికత బీఆర్ఎస్‌కు లేదు

- రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- తొలి పంటకాలంలోనే రూ.2 లక్షలలోపు రుణాల మాఫీ
- రూ.20,616.89 కోట్లతో ఏకకాలంలో పంట రుణమాఫీ
- 25,35,964 మంది రైతులకు రుణమాఫీతో లబ్ధి
- బీఆర్ఎస్ హయాంలో వాయిదాల రుణమాఫీతో రైతులపై వడ్డీ భారం

**హైదరాబాద్, (సిరి న్యూస్):**

రుణమాఫీపై మాట్లాడే నైతికత బీఆర్ఎస్ పార్టీకి లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పెద్ద రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలిచేలా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ఈ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా నిలుస్తూ, ఇచ్చిన మాటకు కట్టుబడి వ్యవహరిస్తున్నదని స్పష్టం చేశారు. గత పాలకుల అనాలోచిత నిర్ణయాలయాతో ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నంగా ఉన్నప్పటికీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి, అధికారంలోకి వచ్చిన మొదటి పంటకాలంలోనే రూ.2 లక్షలలోపు ఉన్న పంట రుణాలను మాఫీ చేశామన్నారు. ఈ నిర్ణయం దేశంలోనే ఒక మైలురాయిగా నిలిచిందని, ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా మారిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలు అర్థరహితమైనవని, పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసమే అని మండిపడ్డారు. వారు అధికారంలో ఉన్న పదేళ్లకాలంలో రుణమాఫీ చేసిన విధానం రైతులకు ఇంకా గుర్తుందని.. రైతులు వారిని పాతళంలోకి తొక్కినప్పటికీ సోయి తప్పి మాట్లాడుతున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు రూ.లక్ష రుణమాఫీని సరిగా చేయలేని బిఆర్ఎస్ పెద్దలు, ఇప్పుడు రైతులపై కపట ప్రేమ చూపెడుతున్నారని అన్నారు. లక్ష వరకు రుణమాఫీని ఒకేసారి చేయలేక వాయిదాల పద్ధతిలో 4 ఏళ్లు చేసిన విషయం మర్చిపోయారని అన్నారు. దాంతో రైతులకు రుణమాఫీ కాకపోగా.. రూ.2,630 కోట్ల వడ్డీ భారం పడిందన్నారు. వారి లోప భూయిష్ట విధానాలు పరిశీలించిన తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేకున్న, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయంతో, రైతులకు ఎలాగైనా ఒకేసారి పంట రుణమాఫీ చేయాలనే కృతనిశ్చయంతో రూ.20,616.89 కోట్ల పంట రుణమాఫీని ఏకకాలంలో చేశామని, దాంతో 25,35,964 మంది రైతులు లబ్ధి పొందారని మంత్రి తుమ్మల అన్నారు. కొన్ని ఖాతాల్లో లోపాలు ఉన్నప్పటికీ, వాటిని సరి చేయడానికి అధికారులు గ్రామాల వారీగా వెళ్లి ప్రయోజనం అందేలా కృషి చేశారని తెలిపారు. ఇది ఈ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత అని అన్నారు.

# పాత వాహనాలకు ఈ10 పెట్రోల్ ఇవ్వాలి

- ఇథనాల్ కలిపిన పెట్రోల్‌పై దేశవ్యాప్తంగా చర్చ
- పాత వాహనాల కోసం ఈ10 అందుబాటులోకి తేవాలి
- సీఈఏ అనంత నాగేశ్వరన్ కీలక సూచనలు
- బీఎస్-4కు ముందు వాహనాలు 7.5–8 కోట్ల వరకు
- అధిక ఇథనాల్‌తో ఇంజిన్‌పై ప్రభావం ఉండొచ్చు
- పాత రబ్బరు భాగాలపై ప్రతికూల ప్రభావం
- పాత వాహనాలను ఇథనాల్‌కు అనుగుణంగా మార్చే అవకాశం
- వాహనాల మార్పునకు కొంత సమయం పడుతుంది

**నేషనల్‌బ్యూరో, (సిరి న్యూస్):**

ఇథనాల్ కలిపిన పెట్రోల్ వినియోగంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) వి. అనంత నాగేశ్వరన్ కీలక సూచనలు చేశారు. పాత వాహనాల కోసం తక్కువ ఇథనాల్ కలిగిన ఈ10 పెట్రోల్‌ను మళ్లీ అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ముఖ్యంగా బీఎస్4కు ముందు తయారైన వాహనాల విషయంలో ఈ10 పెట్రోల్ ప్రత్యామ్నాయంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం దేశంలో బీఎస్4కు ముందు తయారైన వాహనాలు సుమారు 7.5 కోట్ల నుంచి 8 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా ఉందని అనంత నాగేశ్వరన్ పేర్కొన్నారు. ఈ వాహనాల్లో అధిక ఇథనాల్ మిశ్రమం ఉన్న పెట్రోల్ వినియోగించడం వల్ల కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు.

**పాత వాహనాలకే సమస్య ఎక్కువ**

ఇథనాల్ మోతాదు ఎక్కువగా ఉన్న పెట్రోల్‌తో పాత వాహనాల ఇంజిన్లు ఎక్కువగా వేడెక్కే అవకాశం ఉందని సీఈఏ పేర్కొన్నారు. అంతేకాకుండా ఆయా వాహనాల్లో ఉపయోగించిన పాత తరహా రబ్బరు భాగాలు, సీల్స్ వంటి వాటిపై కూడా ఇథనాల్ ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. అయితే ఈ20 పెట్రోల్ కారణంగా ప్రతి పాత వాహనంలోనూ ఇంజిన్ దెబ్బతింటుందని చెప్పడం కాదని, వాహనం తయారైన సంవత్సరం, దాని సాంకేతిక ప్రమాణాలు, ఉపయోగించిన విడిభాగాల వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని ప్రభుత్వం గతంలో పేర్కొంది. కేంద్రం సమర్పించిన వివరాల ప్రకారం కొన్ని పాత వాహనాల్లో రబ్బరు భాగాలు, గాస్కెట్లను సాధారణ సర్వీసింగ్‌లో భాగంగా ముందుగానే మార్చాల్సి రావచ్చని తెలిపింది.

**ఈ10 ఎందుకు అవసరం?**

పాత వాహనాలను ఇథనాల్‌కు అనుగుణంగా మార్చడం సాధ్యమేనని అనంత నాగేశ్వరన్ తెలిపారు. అయితే దేశంలో కోట్ల సంఖ్యలో ఉన్న వాహనాలను మార్చేందుకు కొంత సమయం పడుతుందని వివరించారు. ఆ మార్పిడి ప్రక్రియ పూర్తయ్యే వరకు పాత వాహనాలకు తక్కువ ఇథనాల్ మిశ్రమం కలిగిన ఈ10 పెట్రోల్‌ను అందుబాటులో ఉంచడం వినియోగదారులకు రక్షణ కల్పించే మార్గంగా ఉంటుందని సూచించారు. భారతదేశంలో 2026 ఏప్రిల్ 1 నుంచి దేశవ్యాప్తంగా ఈ20 పెట్రోల్‌నే సాధారణంగా అందుబాటులో ఉంచుతున్న నేపథ్యంలో పాత వాహనాల యజమానుల ఆందోళనలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఈ10ను ప్రత్యామ్నాయంగా అందుబాటులో ఉంచాలన్న సీఈఏ సూచన ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఈ20తో వాహన సమస్య ఒక్కటే కాదు**

పాత వాహనాల్లో ఈ20 పెట్రోల్ పనిచేస్తుందా? లేదా? అనే అంశానికే చర్చను పరిమితం చేయకూడదని అనంత నాగేశ్వరన్ సూచించారు. ఇథనాల్ బ్లెండింగ్ విధానం వల్ల దేశ ఆహార భద్రతపై ఎలాంటి ప్రభావం పడుతుంది? వ్యవసాయ భూమి, నీటి వనరులపై ఒత్తిడి ఎంత పెరుగుతుంది? అనే అంశాలను కూడా ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించాలని పేర్కొన్నారు. ఇథనాల్ ఉత్పత్తికి ఉపయోగించే పంటలకు డిమాండ్ పెరిగితే, అదే సమయంలో ఆహార అవసరాలకు, పశువుల దాణాకు ఉపయోగించే పంటల లభ్యత తగ్గే ప్రమాదం ఉందని ఆయన గుర్తు చేశారు. అందువల్ల ఇథనాల్ ఉత్పత్తి పెంపు విషయంలో దీర్ఘకాలిక ప్రభావాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**ఆహారం.. ఇంధనం.. నీరు**

ఇథనాల్ బ్లెండింగ్ వల్ల దిగుమతి చేసుకునే ముడిచమురు అవసరాన్ని తగ్గించడం, విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయడం వంటి ప్రయోజనాలు ఉన్నప్పటికీ.. అదే సమయంలో ఆహారం, ఇంధనం, నీటి అవసరాల మధ్య సమతుల్యతను కాపాడాల్సిన అవసరం ఉందని సీఈఏ అభిప్రాయపడ్డారు. ఇథనాల్ విధానం కేవలం వాహనాల ఇంజిన్లకు సంబంధించిన అంశం కాదని, వ్యవసాయం, నీటి వనరులు, ఆహార భద్రతతో ముడిపడి ఉన్న విస్తృత ఆర్థిక అంశమని ఆయన సూచించారు.

**ఇథనాల్ విధానంలో సమతుల్యత అవసరం**

ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ వల్ల ముడిచమురు దిగుమతులు తగ్గడం, విదేశీ మారకద్రవ్య ఆదా, కార్బన్ ఉద్గారాల తగ్గింపు వంటి ప్రయోజనాలు ఉన్నాయని కేంద్రం చెబుతోంది. ప్రభుత్వ వివరాల ప్రకారం ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం ద్వారా 201415 నుంచి 2025 డిసెంబర్ వరకు రైతులకు రూ.1.43 లక్షల కోట్లకుపైగా చెల్లింపులు జరిగాయి. ఇదే కాలంలో రూ.1.63 లక్షల కోట్లకుపైగా విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే ఈ ప్రయోజనాలతో పాటు పాత వాహనాల వినియోగదారుల సమస్యలు, ఆహార భద్రత, వ్యవసాయ భూమి, నీటి లభ్యత వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని అనంత నాగేశ్వరన్ సూచించారు. అందువల్ల కొత్త వాహనాలకు ఈ20 కొనసాగిస్తూనే, పాత వాహనాలకు కొంతకాలం ఈ10 పెట్రోల్ అందుబాటులో ఉంచడం వంటి మధ్యంతర పరిష్కారాన్ని పరిశీలించాలని ఆయన సూచనగా నిలిచింది.

# సామాన్యుడిపై 22(ఏ) గుదిబండ!

మొదటిపేజీ తరువాయి

ఎకరాల వ్యవసాయ భూమి, 61.77 లక్షల ఎకరాల అటవీ భూమి, 34.59 లక్షల ఎకరాల పడావు భూమి, 22.23 లక్షల ఎకరాల వ్యవసాయేతర భూమి ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరపకుండా, కేవలం పాత రికార్డుల్లో ఉన్న సమాచారం ఆధారంగానే నివేదికలు తయారు చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో రికార్డుల్లో ఏకంగా 91 లక్షల పైచిలుకు ఎకరాల భూమి 22(ఏ) లో ఉన్నట్లు నమోదు కాగా, అందులో లక్షలాది ఎకరాల ప్రైవేటు భూములు అన్యాయంగా నిషేధిత జాబితాలోకి వెళ్లాయి. కొన్ని చోట్ల ప్రభుత్వ భూముల సర్వే నంబర్లను నిషేధిత జాబితాలో పెట్టే క్రమంలో, అదే సర్వే నంబర్‌లో ఉన్న సామాన్యుల ప్రైవేటు భూములను కూడా నిషేధించడంతో అధికారుల నిర్లక్ష్యం బట్టబయలవుతోంది.

**గ్రేటర్‌లో కాలనీలకు కాలనీలే బంద్**

పట్టణ ప్రాంతాల్లో దాదాపు 1.31 లక్షల ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టగా, ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాల్లోనే లక్ష ఎకరాల భూమి ఈ ఉచ్చులో చిక్కుకుంది. దీనివల్ల నగరంలోని కొన్ని కాలనీలకు కాలనీలే నిషేధిత జాబితాలోకి వెళ్లడంతో ప్రజలు తీవ్ర గగ్గోలు పెడుతున్నారు. అసలు ఏ ప్రాతిపదికన తమ ఇళ్లకు, ప్లాట్లకు నిషేధం విధిస్తున్నారో అర్థం కాక జనం ఇబ్బందులు పడుతున్నారు. ఇలా నిషేధంలోకి వెళ్లిన ఆస్తుల విలువ కొన్ని వేల కోట్ల రూపాయలు ఉంటుంది. సామాన్యులు తమ జీవితకాల కష్టార్జితంతో కొనుగోలు చేసిన అపార్ట్‌మెంట్లు, ఇళ్లు, ఓపెన్ ప్లాట్లు ఇప్పుడు కేవలం కాగితాలకే పరిమితమై, అత్యవసరాలకు అమ్ముకోవడానికి కూడా వీలులేక హైదరాబాద్‌లోని లక్షలాది మంది ప్రజలు ఆఫీసుల చుట్టూ అరిగేలా తిరుగుతున్నారు.

**అటవీ భూముల లెక్కల్లో 23 లక్షల ఎకరాల తేడా**

మరోవైపు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని అటవీ భూమికి సంబంధించి కేంద్రానికి పంపిన నివేదికలో 43.05 లక్షల ఎకరాలు ఉన్నట్లు పేర్కొనగా, ప్రభుత్వం ఇక్కడ జరిపిన సర్వేలో అటవీ భూమి 61.77 లక్షల ఎకరాలుగా నమోదు చేశారు. ఈ రెండు నివేదికల మధ్య ఏకంగా 23 లక్షల ఎకరాల వ్యత్యాసం ఉండటం అధికారుల లెక్కల గందరగోళాన్ని బయటపెడుతోంది. దీనికి తోడు రాష్ట్రంలోని 4,567 గ్రామాల్లో 4.95 లక్షల ఎకరాల్లో సరిహద్దు వివాదాలు నెలకొన్నాయి. ఇందులో 70 శాతానికి పైగా సరిహద్దు సమస్యలను రెవెన్యూ అధికారులే క్షేత్రస్థాయిలో తేల్చాల్సి ఉన్నప్పటికీ, వారు దశాబ్దాలుగా నిర్లక్ష్యం వహించడంతో వివాదాలు ముదిరి సామాన్యుల మెడకు చుట్టుకున్నాయి.

**డిజిటలైజేషన్ పొరపాట్లు..**

తెలంగాణ ఏర్పడిన తర్వాత తీసుకొచ్చిన ధరణి పోర్టల్ విధానం కోసం రెవెన్యూ రికార్డులను డిజిటలైజేషన్ చేసిన సమయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు చేసిన తీవ్ర పొరపాట్లు నేటికీ ప్రజలకు శాపంగా మారాయి. ప్రైవేటు వ్యక్తుల భూములను నమోదు చేసే క్రమంలో ఆపరేటర్లు తప్పుగా ప్రభుత్వ భూములుగా మార్క్ చేయడంతో ఎంతోమంది నిజమైన యజమానులు రికార్డుల సరిదిద్దుబాటు కోసం అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. అధికారులు చేసిన చిన్న చిన్న తప్పుల వల్ల లక్షలాది మంది సామాన్యులు ఏ తప్పూ చేయకుండానే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తీవ్ర మానసిక, ఆర్థిక వేదన అనుభవిస్తున్నారు.

**హైకోర్టు ఆదేశించినా మారని రెవెన్యూ వైఖరి**

భూభారతి ద్వారా నిషేధిత జాబితాలో చేర్చిన సర్వే నంబర్లకు సంబంధించి బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను 2016 తెలంగాణ రిజిస్ట్రేషన్ చట్టం (నిబంధనలు 238 నుండి 241) ప్రకారం పరిశీలించి, 45 రోజుల్లోగా పరిష్కరించాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ అధికారుల తీరులో మార్పు రాకపోవడంతో సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. రోజుకో కొత్త నిబంధన పేరుతో సొంత ఆస్తులను అమ్ముకోకుండా, హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వ తీరుపై బాధితులు, సామాన్య ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సర్వే నంబర్ల పొరపాట్లను సరిదిద్ది, ప్రైవేటు ఆస్తులను 22(ఏ) నుంచి మినహాయించాలని డిమాండ్ చేస్తున్నారు.



# ఇరాన్ అణుబాంబుపై ఫేక్ పోస్టు..

- ఎక్స్‌లో వైరల్ అయిన ఓ పోస్టుతో మొదలైన గందరగోళం
- ఇరాన్ అణ్వాయుధాలపై ఐఆర్‌జీసీ కమాండర్ వ్యాఖ్యలంటూ ప్రచారం
- కమాండర్ ఫొటోతో ఏఐ రూపొందించిన అణు పేలుడు చిత్రం
- ఇజ్రాయెల్ మీడియా కథనాలతో మరింత ఉధృతమైన ప్రచారం
- ఇరాన్ తొలిసారి అణుబాంబు తయారీని అంగీకరించిందంటూ వార్తలు
- పోస్టును షేర్ చేసిన ఇజ్రాయెల్, అమెరికా ప్రముఖులు
- నెతన్యాహు, అమెరికా ప్రతినిధి స్పందన
- 'ది టైమ్స్' ఫ్యాక్ట్‌చెక్‌తో అసలు విషయం వెలుగులోకి
- ఫేక్ పోస్టుగా తేలడంతో తొలగించిన అమెరికా అధికారి
- తమపై తప్పుడు ప్రచారం: ఇరాన్ ఆగ్రహం

**నేషనల్‌బ్యూరో, (సిరి న్యూస్):**

పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు ఎప్పుడు సద్దుమణుగుతాయో తెలియని అనిశ్చితి కొనసాగుతున్న వేళ.. అమెరికాఇరాన్ పరస్పర దాడులతో పాటు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న నకిలీ వార్తలు, ఏఐ రూపొందించిన చిత్రాలు కూడా ఉద్రిక్తతలకు ఆజ్యం పోస్తున్నాయి. తాజాగా భారత్‌కు చెందిన ఓ ఎక్స్ ఖాతాలో చేసిన పోస్టు ఇజ్రాయెల్, అమెరికాలో తీవ్ర గందరగోళానికి దారితీసింది. ఇరాన్ అణ్వాయుధాల తయారీకి సంబంధించి ఆ దేశ సైనిక అధికారి చేసిన వ్యాఖ్యలుగా పేర్కొంటూ పెట్టిన పోస్టు.. చివరకు ఫేక్ న్యూస్‌గా తేలింది.

**ఆగస్టు 5న వైరల్ పోస్టు**

ఆగస్టు 5న భారత్‌లోని ఓ ఎక్స్ ఖాతాలో ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించి ఓ పోస్టు వెలువడింది. ఇజ్రాయెల్, అమెరికా అణ్వాయుధాలను కలిగి ఉన్నంతకాలం ఇరాన్ తన అణు ప్రయత్నాలను వదులుకోదని ఐఆర్‌జీసీ కమాండర్ బ్రిగేడియర్ జనరల్ అహ్మద్ వాహిదీ చెప్పినట్లు అందులో పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలకు మద్దతుగా వాహిదీ ఫొటోను, అణు పరీక్షల సమయంలో వెలువడే పొగను పోలిన ఏఐ రూపొందించిన చిత్రాన్ని కూడా పోస్టులో ఉంచారు. దీంతో ఆ పోస్టు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అయింది.

**ఇజ్రాయెల్ మీడియాలో ప్రచారం**

ఈ పోస్టును ఆధారంగా చేసుకుని ఇజ్రాయెల్ మీడియా పలు కథనాలను ప్రసారం చేసింది. ఇరాన్ తమ వద్ద అణుబాంబు తయారీ జరుగుతోందని తొలిసారిగా బహిరంగంగా అంగీకరించిందన్న ప్రచారం మొదలైంది. అంతటితో ఆగకుండా ఈ పోస్టు ఇజ్రాయెల్, అమెరికా రాజకీయ వర్గాల్లోనూ చర్చకు వచ్చింది. ఇరాన్ అణు కార్యక్రమంపై ఇప్పటికే తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో ఈ ప్రచారం మరింత కలకలం రేపింది.

**నెతన్యాహు స్పందన**

వైరల్ అయిన పోస్టుపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా స్పందించినట్లు కథనాలు వెలువడ్డాయి. ఇరాన్ ఉద్దేశాలకు సంబంధించిన తమ వాదనలకు ఈ ప్రకటన మరింత బలం చేకూరుస్తోందని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. అమెరికా రాజకీయ వర్గాల్లోనూ ఈ పోస్టు చర్చకు వచ్చింది. ఐరాసలో అమెరికా రాయబారి మైక్ వాల్జ్ ఆ పోస్టును షేర్ చేశారు. ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా, ఇజ్రాయెల్ కొన్నేళ్లుగా చెబుతున్న విషయాన్ని ఇప్పుడు ఇరాన్ అంగీకరించిందన్న భావనను ఆయన వ్యక్తం చేశారు.

అమెరికా సెనెటర్ రిక్ స్కాట్ కూడా ఆ పోస్టును షేర్ చేయడంతో వ్యవహారం మరింత విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. అమెరికాలోని కొన్ని ప్రధాన మీడియా సంస్థలు కూడా దీనిపై కథనాలు ప్రసారం చేశాయి.

'ది టైమ్స్' ఫ్యాక్ట్‌చెక్‌తో అసలు విషయం

అయితే ఈ ప్రచారంపై 'ది టైమ్స్' నిర్వహించిన ఫ్యాక్ట్‌చెక్‌లో అసలు విషయం బయటపడింది. వైరల్ అవుతున్న పోస్టులో పేర్కొన్న విధంగా ఇరాన్ కమాండర్ అహ్మద్ వాహిదీ అలాంటి వ్యాఖ్యలు చేసినట్లు ఆధారాలు లేవని తేలింది. దీంతో ఆ పోస్టు ఫేక్ న్యూస్ అని నిర్ధారణ అయింది.

అంతేకాకుండా పోస్టులో ఉపయోగించిన అణు పేలుడు దృశ్యాన్ని పోలిన చిత్రం ఏఐ ద్వారా రూపొందించినదిగా గుర్తించారు. దీంతో అసలు వ్యాఖ్యలు, వాటికి జోడించిన చిత్రం రెండింటి విశ్వసనీయతపైనా అనుమానాలు వ్యక్తమయ్యాయి.

**పోస్టును తొలగించిన అమెరికా అధికారి**

పోస్టు నకిలీదని తేలిన తర్వాత ఐరాసలో అమెరికా రాయబారి మైక్ వాల్జ్ తన సోషల్ మీడియా పోస్టును తొలగించినట్లు సమాచారం. అంతకుముందు ఆయన ఆ పోస్టును షేర్ చేయడం ఈ వ్యవహారానికి మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది. ఓ సోషల్ మీడియా పోస్టు ఎంత వేగంగా అంతర్జాతీయ రాజకీయ చర్చలోకి వెళ్లగలదో ఈ ఘటన మరోసారి చూపించింది. ముఖ్యంగా యుద్ధ పరిస్థితుల్లో ధ్రువీకరించని సమాచారాన్ని ప్రముఖులు షేర్ చేస్తే దాని ప్రభావం మరింత తీవ్రంగా ఉండొచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

**ఇరాన్ తీవ్ర ఆగ్రహం**

ఈ వ్యవహారంపై ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ స్పందించారు. తమ దేశానికి వ్యతిరేకంగా సాగుతున్న తప్పుడు ప్రచారానికి ఈ ఘటన నిదర్శనమని ఆరోపించారు. ఇరాన్‌పై సైనిక చర్యను సమర్థించుకునేందుకు ఇజ్రాయెల్ రెండు దశాబ్దాలుగా అణు కార్యక్రమం పేరుతో ఇలాంటి ప్రచారాలు చేస్తోందని ఆయన విమర్శించారు.

అయితే ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా, ఇజ్రాయెల్ ఆందోళనలు కొత్తవి కావు. టెహ్రాన్ యురేనియం శుద్ధి కార్యక్రమం పూర్తిగా పౌర ప్రయోజనాల కోసమేనని చెబుతుండగా.. అమెరికా, ఇజ్రాయెల్ మాత్రం ఇరాన్ అణ్వాయుధ సామర్థ్యాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తోందని చాలాకాలంగా ఆరోపిస్తున్నాయి.

**యుద్ధ సమయంలో ఫేక్ న్యూస్ ప్రమాదం**

ఇరాన్ అణు కార్యక్రమమే పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ప్రధాన అంశాల్లో ఒకటిగా ఉంది. ఇలాంటి సున్నితమైన సమయంలో ఒక నకిలీ సోషల్ మీడియా పోస్టు ఇజ్రాయెల్, అమెరికా రాజకీయ, మీడియా వర్గాల్లోకి వెళ్లడం తీవ్ర చర్చకు దారితీసింది.

ఈ ఘటనతో యుద్ధ సమయంలో సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని ధ్రువీకరించకుండా ప్రచారం చేయడం ఎంత ప్రమాదకరమో మరోసారి స్పష్టమైంది. ముఖ్యంగా ఏఐతో రూపొందించిన చిత్రాలు, నకిలీ వ్యాఖ్యలు, పాత ఫొటోలను కొత్త సందర్భాలకు జోడించడం ద్వారా తప్పుడు కథనాలను సృష్టించే ప్రమాదం పెరుగుతోంది.

అందుకే ఇరాన్ అణ్వాయుధాలపై వైరల్ అయిన ఈ పోస్టు విషయంలో ఇరాన్ అణుబాంబు తయారు చేస్తున్నట్లు అధికారికంగా అంగీకరించింది" అనే ప్రచారాన్ని నమ్మడానికి ఆధారం లేదని ఫ్యాక్ట్‌చెక్‌లో తేలింది. యుద్ధ వాతావరణంలో ఫేక్ న్యూస్ కూడా ఒక ఆయుధంగా మారే ప్రమాదాన్ని ఈ ఘటన మరోసారి చాటి చెప్పింది.

# సైలెన్సర్ మార్చితే కేసు తప్పదా?

మొదటిపేజీ తరువాయి

వాహనదారుడు పేర్కొంటున్నాడు. తాళాలు ఇచ్చిన అనంతరం వాహనాన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించి అక్కడే ఉంచినట్లు ఆయన ఆరోపించారు. మరుసటి రోజు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వాహనాన్ని ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించినప్పటికీ సరైన సమాధానం ఇవ్వలేదని, సదరు సిబ్బంది తనతో దురుసుగా ప్రవర్తించారని ఆరోపించాడు. తన వాహనంపై ఏదైనా కేసు నమోదు చేస్తే ఫైన్ చెల్లించి వాహనాన్ని తీసుకెళ్తానని చెప్పినప్పటికీ.. ట్రాఫిక్ పోలీసులు వాహనానికి అధిక శబ్దం వచ్చేలా సైలెన్సర్ ఉపయోగిస్తున్నారని, దానిపై కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని బాధితుడు వాపోయాడు.

**సైలెన్సర్ మార్పు ఉంటే చర్యకు అవకాశం**

వాహనానికి కంపెనీ అమర్చిన సైలెన్సర్ స్థానంలో నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసి ఉంటే పోలీసులు చర్యలు తీసుకునే అవకాశం ఉంది. Motor Vehicles Act లోని Section 52 ప్రకారం వాహనంలో తయారీదారు నిర్దేశించిన వివరాలకు భిన్నంగా మార్పులు చేయడంపై పరిమితులు ఉన్నాయి. అదేవిధంగా Central Motor Vehicle Rules, 1989లోని Rule 120 ప్రకారం ప్రతి మోటార్ వాహనానికి సైలెన్సర్ ఉండాలి. వాహనం నిర్దేశిత శబ్ద ప్రమాణాలకు అనుగుణంగా ఉండాల్సి ఉంటుంది. వాహనం శబ్ద కాలుష్య ప్రమాణాలను ఉల్లంఘిస్తే Motor Vehicles Act Section 190(2) కింద చర్యలు తీసుకునే అవకాశం ఉంది. రోడ్డు భద్రత, శబ్దం, వాయు కాలుష్యానికి సంబంధించిన నిర్దేశిత ప్రమాణాల ఉల్లంఘనలకు ఈ నిబంధనలు వర్తిస్తాయి.

**వాహనాన్ని సీజ్ చేసే అధికారం ఎక్కడ?**

ఇక్కడే అసలు ప్రశ్న తలెత్తుతోంది. Section 207 ప్రకారం రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, పర్మిట్ తదితర నిర్దిష్ట ఉల్లంఘనలకు సంబంధించి అధికారికంగా వాహనాన్ని డిటైన్ చేసే అధికారం ఉంటుంది. అయితే కేవలం సైలెన్సర్ నిబంధనల ఉల్లంఘన ఆరోపణ ఆధారంగా Section 207ను వర్తింపజేయవచ్చా? అన్నది పరిశీలించాల్సిన అంశంగా మారింది. అందువల్ల ఈ వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లయితే.. ఏ సెక్షన్ కింద చర్య తీసుకున్నారు? ఎవరి ఆదేశాలతో వాహనాన్ని డిటైన్ చేశారు? చలాన్ జారీ చేశారా? సీజ్ మెమో లేదా ఇతర రికార్డు ఇచ్చారా? వాహనాన్ని స్టేషన్‌లో ఉంచడానికి కారణం ఏమిటి? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

**వేలాది ట్రాఫిక్ సమస్యల మధ్య బుల్లెట్లపైనే ప్రత్యేక దృష్టి ఎందుకు?**

ఖమ్మం నగరంలో ట్రాఫిక్ సమస్యలు, నిబంధనల ఉల్లంఘనలు వేల సంఖ్యలో ఉన్న నేపథ్యంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి బుల్లెట్ వాహనాల సైలెన్సర్లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టడంపై వాహనదారుల్లో చర్చ జరుగుతోంది. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా లేదా చట్టపరమైన చర్యలు తప్పక తీసుకోవాల్సిందే. అయితే చర్యకు చట్టపరమైన ఆధారం, విధానం, రికార్డు కూడా అంతే స్పష్టంగా ఉండాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాహనదారుడి ఆరోపణలు నిజమా? సైలెన్సర్ నిబంధనల ఉల్లంఘన కారణంగా వాహనాన్ని ఏ సెక్షన్ కింద డిటైన్ చేశారు? సంబంధిత చలాన్ లేదా కేసు నమోదు చేశారా? అనే విషయాలను ట్రాఫిక్ పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సిన అవసరం ఉంది.

**వాహనం స్టేషన్‌కు తరలిస్తే.. బాధ్యత ఎవరిది?**

నిబంధనల అమలు అందరికీ ఒకేలా ఉండాలి. చర్య ఉంటే అది చట్టబద్ధంగా ఉండాలి. వాహనాన్ని సీజ్ లేదా డిటైన్ చేస్తే కారణం, వర్తించే సెక్షన్, సంబంధిత రికార్డు స్పష్టంగా ఉండాలి. వాహనదారుడి వాదన ప్రకారం.. మూడు రోజులు గడిచినా వాహనాన్ని ఎందుకు స్టేషన్‌కు తరలించారనే దానిపై ట్రాఫిక్ సిబ్బంది నుంచి స్పష్టత రాలేదు. అంతేకాకుండా, ఎటువంటి అధికారిక పత్రాలు లేకుండా వాహనాన్ని పోలీసులు తీసుకెళ్లినట్లయితే.. ఆ వాహనం స్టేషన్‌లో ఉన్న సమయంలో ఏదైనా నష్టం జరిగినా, చోరీకి గురైనా బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

గతంలో పోలీసు సిబ్బందిపై కూడా వివిధ నేరాలకు సంబంధించిన ఆరోపణలు, కేసులు వెలుగులోకి వచ్చిన సందర్భాలు ఉన్నాయని వాహనదారులు గుర్తుచేస్తున్నారు. అయితే వాటిని ఆధారంగా చేసుకుని ప్రస్తుత ఘటనపై ఎలాంటి నిర్ణయానికి రాలేం. కానీ ఒక వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించినప్పుడు దానికి సంబంధించిన సీజ్ మెమో, చలాన్, కేసు వివరాలు లేదా ఇతర అధికారిక రికార్డు వాహనదారుడికి అందించడం ద్వారా అనుమానాలకు తావులేకుండా చేయాల్సిన అవసరం ఉంది.

# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కొనసాగిస్తాం

**మొదటిపేజీ తరువాయి**

ఇటీవల ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ఇకపై పథకాలు నిలిచిపోతాయంటూ జరుగుతున్న ప్రచారంపై ఆయన స్పందించారు. పథకాలను ఆపే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, హైకోర్టులో ఉన్న స్టేను ఎత్తివేయించి పథకాలను కొనసాగించేందుకు ప్రభుత్వం న్యాయపరంగా ప్రయత్నిస్తున్నదని తెలిపారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ఇటీవల విచారణ జరిపింది. ప్రభుత్వ ఆర్థిక ప్రాధాన్యతలపైనా న్యాయస్థానం ప్రశ్నలు లేవనెత్తింది. ఆ తర్వాత ఆగస్టు 13న ఈ రెండు పథకాల అమలుపై స్టే విధించినట్లు నివేదికలు వెలువడ్డాయి. దీంతో పథకాలు ఇక కొనసాగవన్న ప్రచారం మొదలైంది.

**స్టేను సాకుగా చేసుకుని రాజకీయం**

హైకోర్టు పరిణామాలను సాకుగా చేసుకుని భారాస నేతలు రాజకీయాలు చేస్తున్నారని పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. కోర్టు ఒక అంశంపై వివరణ కోరినంత మాత్రాన ప్రభుత్వం పథకాలను నిలిపివేసినట్లు కాదని స్పష్టం చేశారు. న్యాయస్థానంలో తమ వాదనలు వినిపించి, స్టేను ఎత్తివేయించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడుతున్న సంక్షేమ పథకాలను కొనసాగించడమే ప్రభుత్వ ఉద్దేశమని, వాటిపై అనవసరమైన అపోహలు సృష్టించవద్దని మంత్రి పేర్కొన్నారు.

**మూడు నెలల్లోనే చెక్కులు**

కల్యాణలక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు ఇప్పటివరకు ఏ విధంగా చెక్కులు అందించారో, ఇకపై కూడా అదే విధానాన్ని కొనసాగిస్తామని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మూడు నెలల్లోనే కల్యాణలక్ష్మి చెక్కులు అందించే విధానం కొనసాగుతుందని చెప్పారు. గతంలో ఏడాదికి ఒకసారి చెక్కులు ఇచ్చే పరిస్థితి ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలలకు ఒకసారి అందించే విధానాన్ని అమలు చేస్తోందని గతంలోనూ శ్రీహరి వెల్లడించారు.

పథకాలు ఆగిపోతాయన్న ప్రచారం వద్దు

కోర్టు ఆదేశాల నేపథ్యంలో లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రులు స్పష్టం చేశారు. కోర్టు ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ పథకాలను కొనసాగించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నిస్తోందని తెలిపారు. అర్హులైన పేద కుటుంబాలకు పెళ్లి సమయంలో ఆర్థికంగా అండగా నిలవాలన్న ఉద్దేశంతో ఈ పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు తెలంగాణలో 2014లో ప్రారంభమయ్యాయి. పేద కుటుంబాల్లో వివాహ ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది.

**బీఆర్ఎస్ పథకాలపై రాజకీయం చేయలేదు**

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని సంక్షేమ పథకాల విషయంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ కక్షతో వ్యవహరించలేదని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే పథకాలను కొనసాగించడమే తమ ప్రభుత్వ విధానమని చెప్పారు.

అదే విధంగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ విషయంలోనూ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తోందని తెలిపారు. కోర్టులో కేసు ఉన్నంత మాత్రాన పథకం పూర్తిగా రద్దయినట్లు ప్రచారం చేయడం సరికాదని, న్యాయపరమైన ప్రక్రియ పూర్తయ్యే వరకు లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

**పేద కుటుంబాలకు అండగా..**

పెళ్లి సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే అర్హులైన కుటుంబాలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఆర్థికంగా కొంత ఊరటనిస్తున్నాయి. అందుకే పథకాల కొనసాగింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. మొత్తంగా, కోర్టు పరిణామాలను కారణంగా చూపి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిలిపివేసే ఆలోచన తమకు లేదని, హైకోర్టులో స్టే ఎత్తివేయించేందుకు ప్రయత్నిస్తూ పథకాలను యథాతథంగా కొనసాగిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# అంత సీరియస్ అయితే ఇన్నాళ్లూ ఎందుకు మౌనంగా ఉన్నారు?

**మొదటిపేజీ తరువాయి**

నిలదీసింది. ఆరోపణలు నిజంగా తీవ్రమైనవిగా భావిస్తే దర్యాప్తు సంస్థలు స్వయంగా చర్యలు తీసుకునే అధికారం కలిగి ఉన్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

రాహుల్ గాంధీపై అక్రమాస్తుల ఆరోపణలకు సంబంధించి అలహాబాద్ హైకోర్టు కొనసాగిస్తున్న విచారణను ప్రస్తుతానికి నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. హైకోర్టులో ఈ నెల 20న జరగాల్సిన తదుపరి విచారణను వాయిదా వేయాలని సూచించింది. అంతేకాకుండా ఈ కేసుకు సంబంధించి సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైకోర్టుకు ఎలాంటి దర్యాప్తు నివేదికను సమర్పించకూడదని మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది.

**సీబీఐ, ఈడీని నిలదీసిన ధర్మాసనం**

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం సోమవారం రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ సందర్భంగా దర్యాప్తు సంస్థల తరపున హాజరైన ఎస్.వీ. రాజును జస్టిస్ బాగ్చి ప్రశ్నించారు. ఇది అంత తీవ్రమైన విషయమైతే మీ దర్యాప్తు సంస్థ ఇన్నాళ్లూ ఎందుకు మౌనంగా ఉంది? కోర్టు నుంచి ఆదేశాలు రావాల్సిందేనా? మీరు సుమోటోగా చర్యలు తీసుకున్నారా? లేదు కదా? అని ప్రశ్నించినట్లు కోర్టు విచారణ వివరాలు వెల్లడిస్తున్నాయి. దర్యాప్తు సంస్థలకు ఏదైనా తీవ్రమైన, గుర్తించదగిన నేరానికి సంబంధించిన సమాచారం ఉంటే, అందుకు ప్రతి సందర్భంలోనూ కోర్టు అనుమతి అవసరం లేదని ధర్మాసనం పేర్కొంది.

**కోర్టు ఆదేశాలపై సహజ న్యాయ సూత్రం**

కోర్టు స్వయంగా ఒక వ్యక్తిపై దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేయాలనుకుంటే, సంబంధిత వ్యక్తికి తన వాదన వినిపించే అవకాశం ఇవ్వడం సహజ న్యాయ సూత్రంలో భాగమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. "ఎవరైనా హత్య చేసినట్లు ఆరోపణలు ఉంటే పోలీసులు దర్యాప్తు చేయడానికి కోర్టు అనుమతి అవసరం లేదు. అయితే కోర్టు స్వయంగా ఒక దిశానిర్దేశం చేయాలనుకుంటే ఇరుపక్షాల వాదనలు విని సహజ న్యాయ సూత్రాలను పాటించాలి" అన్న భావనను ధర్మాసనం వ్యక్తం చేసింది. ([Live Law][2])

**సీబీఐ ఏం చేసిందన్న సిబల్**

రాహుల్ గాంధీ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన వ్యక్తికి ఈ వ్యవహారంలో పిటిషన్ దాఖలు చేసే అర్హత ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ కేసు చట్టపరమైన ప్రక్రియకు విరుద్ధంగా సాగుతున్న "విచ్ హంట్"గా మారిందని సిబల్ ఆరోపించారు. పిటిషనర్ పదేపదే రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా పిటిషన్లు దాఖలు చేస్తున్నారని, ఆయనకు ఈ వ్యవహారంలో జోక్యం చేసుకునే హక్కు ఏంటని ప్రశ్నించారు. సీబీఐ ఇప్పటివరకు ఫిర్యాదును కేవలం పరిశీలించడమే చేసిందని, ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని సిబల్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

**'ఇది ప్రీ-ఎఫ్ఐఆర్ దశ'.. పిటిషనర్**

రాహుల్ గాంధీ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ హైకోర్టులో ఫిర్యాదు చేసిన ఎస్.విగ్నేశ్ శిశిర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సుప్రీంకోర్టు ముందు వాదనలు వినిపించారు. ప్రస్తుతం వ్యవహారం ప్రీ ఎఫ్ఐఆర్ దశలోనే ఉందని, ఎఫ్ఐఆర్ నమోదు చేయకముందు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి వాదనలు వినిపించే హక్కు ఉండదని పేర్కొన్నారు. ([Live Law][2]) దర్యాప్తు సంస్థల తరపున ఎస్.వీ. రాజు కూడా ఇదే తరహాలో వాదిస్తూ, సీబీఐ ఇప్పటివరకు ఫిర్యాదును పరిశీలిస్తోందని, ఇంకా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని తెలిపారు. ఫిర్యాదులో గుర్తించదగిన నేరానికి సంబంధించిన అంశాలు బయటపడితే అది తీవ్రమైన విషయంగా మారుతుందని చెప్పారు.

**అలహాబాద్ హైకోర్టు ఏం చేసింది?**

రాహుల్ గాంధీ తన ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారంటూ కర్ణాటకకు చెందిన ఎస్.విగ్నేశ్ శిశిర్ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. సీబీఐ, ఈడీ దర్యాప్తు చేయాలని కోరారు.

ఈ ఫిర్యాదుపై అలహాబాద్ హైకోర్టు మే నెలలో సీబీఐ, ఈడీ ఆరోపణలను పరిశీలించి ధ్రువీకరించాలని ఆదేశించింది. అనంతరం జూలై 20న సీబీఐ దాఖలు చేసిన నివేదికపై అసంతృప్తి వ్యక్తం చేసిన హైకోర్టు.. దర్యాప్తు పురోగతిని వివరించేలా సీబీఐ ఉన్నతాధికారితో తాజా అఫిడవిట్ దాఖలు చేయించాలని ఆదేశించింది. ఈడీకి సంబంధించి కూడా ఆరోపణలపై విచారణలో ఏదైనా అక్రమానికి సంబంధించిన సమాచారం, పత్రాలు లభిస్తే చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవచ్చని హైకోర్టు పేర్కొంది.

**ఆగస్టు 20 విచారణకు బ్రేక్**

అలహాబాద్ హైకోర్టు ఈ కేసును ఆగస్టు 20న మరోసారి విచారించాల్సి ఉంది. అయితే రాహుల్ గాంధీ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో సోమవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. సుప్రీంకోర్టు తదుపరి విచారణ జరిగే వరకు అలహాబాద్ హైకోర్టు ఈ వ్యవహారాన్ని ముందుకు తీసుకెళ్లకూడదని ఆదేశించింది. అలాగే సీబీఐ, ఈడీ లేదా ఇతర దర్యాప్తు సంస్థలు హైకోర్టుకు ఎలాంటి నివేదిక సమర్పించకూడదని స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై ఎస్.విగ్నేశ్ శిశిర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

**ఆరోపణలు ఇంకా నిరూపితం కాలేదు**

రాహుల్ గాంధీపై వచ్చిన అక్రమాస్తుల ఆరోపణలు ప్రస్తుతం ఆరోపణల దశలోనే ఉన్నాయి**. ఈ వ్యవహారంలో రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదైందని లేదా ఆరోపణలు నిజమని దర్యాప్తు సంస్థలు తేల్చాయని ఇప్పటివరకు వెల్లడి కాలేదు. హైకోర్టు ఆదేశించిన ప్రక్రియ కూడా ప్రధానంగా ఆరోపణలను పరిశీలించడం, దర్యాప్తు పురోగతిని తెలుసుకోవడం చుట్టూనే సాగింది. ఇలాంటి పరిస్థితుల్లో, ఆరోపణలు అంత తీవ్రమైనవైతే దర్యాప్తు సంస్థలు ఇప్పటివరకు ఎందుకు స్వయంగా చర్యలు తీసుకోలేదు? అన్న సుప్రీంకోర్టు ప్రశ్నలు ఈ కేసులో కీలకంగా మారాయి. మరోవైపు, హైకోర్టు దర్యాప్తునకు ఆదేశించే ముందు రాహుల్ గాంధీకి అవకాశం ఇచ్చిందా లేదా అనే అంశంపైనా సుప్రీంకోర్టు దృష్టి సారించింది. తదుపరి విచారణలో ఈ అంశాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# సర్కార్ నడుపుతున్నవా.. లేక సర్కస్ నడుపుతున్నవా

**మొదటిపేజీ తరువాయి**

నెట్టే ప్రయత్నం మంత్రి పొన్నం ప్రభాకర్ చేస్తున్నారని, ఇక 22ఏ నిషేధిత భూముల విషయంలో భూదందా వెలుగులోకి రావడంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ''సారీ'' అంటూ తప్పించుకుని, అధికారులపై నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు పొన్నం, పొంగులేటి వీడియోలను ఎక్స్ వేదికగా షేర్ చేస్తూ.. ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్న అంశాల్లో సరిదిద్దుకోలేని తప్పు చేసి, ''సారీ'' చెప్పి తప్పించుకుంటే సరిపోదని సీఎం రేవంత్ రెడ్డిని ట్యాగ్ చేశారు.

**మీరు కాదు.. మీపైనే ప్రజలు సీరియస్**

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఇక రావేమోనని పేదలు ఆందోళన చెందుతున్నారని, 22ఏ నిషేధిత భూముల వ్యవహారంతో ఎంతోమంది మానసిక వేదనకు గురయ్యారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులైన అధికారులపై మీరు చర్యలు తీసుకోవడం కాదు.. మీ నిర్లక్ష్యం, మీ ప్రభుత్వ వైఫల్యంపై ముందు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అధికారులపై మీరు సీరియస్‌గా ఉండటం కాదు.. తెలంగాణ ప్రజలు మీ ప్రభుత్వంపై సీరియస్‌గా ఉన్నారన్నారు. కర్రు కాల్చి వాత పెట్టేందుకు తగిన సమయం కోసం ఎదురు చూస్తున్నారని, మీరు ఎన్నిసార్లు సారీ చెప్పినా ప్రజలకు ఒరిగేది ఏమీ లేదన్నారు. కళ్యాణ లక్ష్మి పథకం ఆగకూడదు. రాష్ట్రవ్యాప్తంగా నిషేధిత జాబితా నుంచి భూహక్కుదారుల భూములను తొలగించి, వారికి పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.



## పరిశ్రమలు–విద్యార్థులను అనుసంధానించే
# దేశంలోనే తొలి జాబ్ పోర్టల్

**మొదటిపేజీ తరువాయి**

వివేక్ పేర్కొన్నారు. పరిశ్రమలకు అవసరమైన సిబ్బంది లభించడంతోపాటు స్థానిక యువతకు ఉద్యోగాలు దక్కేలా ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని చెప్పారు.

దేశంలో నిరుద్యోగం పెద్ద సమస్యగా మారిందని మంత్రి అన్నారు. విద్యార్థులు కేవలం సాఫ్ట్‌వేర్ రంగంపైనే ఆధారపడకుండా వివిధ పారిశ్రామిక, సాంకేతిక రంగాల్లో ఉన్న అవకాశాలను కూడా అందిపుచ్చుకోవాలని సూచించారు.



తెలంగాణ యువతకు విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు టామ్‌కామ్ ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. సింగరేణి ప్రాంతంలోని మందమర్రిలో యువతకు జర్మన్ భాషను బోధిస్తున్నామని, శిక్షణ పొందిన వారిలో కొందరు బీ2 స్థాయికి చేరుకున్నారని తెలిపారు. అర్హత సాధించిన వారికి విదేశాల్లో సుమారు రూ.25 లక్షల వరకు వార్షిక వేతనాలతో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

విదేశాలకు వెళ్లే యువతకు వీసా ఖర్చుల్లో సగం వరకు ప్రభుత్వం భరిస్తోందని మంత్రి వెల్లడించారు. విదేశాల్లో ఉద్యోగాలు పొందడం ద్వారా యువతతోపాటు వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుపడుతుందని వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

## నూతన గృహప్రవేశంలో పాల్గొన్న
# బొబ్బిలి చంద్రశేఖర్ ముదిరాజ్

**శంషాబాద్ ఆగస్టు17 (సిరి న్యూస్):**

శంషాబాద్ జిహెచ్ఎంసి పరిధిలో వెంకటేశ్వర కాలనీలో సాయి కన్స్ట్రక్షన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రభువు ముదిరాజ్ దంపతుల గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్వాల్ గూడ 119 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొబ్బిలి చంద్రశేఖర్ ముదిరాజ్ పాల్గొని తీర్థప్రసాదాలు తీసుకొని దంపతులతో మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు నూతన గృహం నిర్మించుకోవాలని ప్రతి ఒక్క వ్యక్తి కలగా ఉంటుందని ఆ కలను సహకారం చేసుకోవడానికి ఎన్నో ఉడుదుడుకులు ఎదుర్కొంటేనే తప్ప నూతన గృహ నిర్మాణం చేపట్టలేమని నూతన గృహ నిర్మాణం చేసుకున్న ప్రభు ముదిరాజ్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.



## వంట గ్యాస్ వినియోగదారులకు
# శుభవార్త..

**మొదటిపేజీ తరువాయి**

మౌలిక వసతులపై తీవ్ర ఒత్తిడి పడటంతో యాప్‌లు పనిచేయకపోవడం, సర్వర్లు నిలిచిపోవడం వంటివి జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం ఫేషియల్ లేదా వేలిముద్రల గుర్తింపు ప్రక్రియ కోసం అవసరమైన పత్రాలతో కేంద్రాలకు వెళ్తున్నప్పటికీ, ప్రక్రియ పూర్తవుతుందో లేదో తెలియక పౌరులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల డిజిటల్ సిస్టమ్స్ నిలిచిపోయినప్పుడు కేంద్రాల వద్ద సిబ్బంది ఉన్నా పని ముందుకు సాగడం లేదు.

పంపిణీదారుల అభిప్రాయం ప్రకారం.. కేవలం తేదీలు పొడిగించడం వల్ల సమస్య పరిష్కారం కాదు.. డిజిటల్ సిస్టమ్స్ సామర్థ్యాన్ని పెంచడం అత్యంత ఆవశ్యకం. ఒక్క రోజు సర్వర్ సమస్య వచ్చినా ఆ బకాయి పని తదుపరి రోజులకు బదిలీ అయి క్యూలైన్లు మరింత పెరుగుతున్నాయి. రోజువారీగా వచ్చే వేలాది విన్నపాలను తట్టుకునేలా సాంకేతిక లోపాలను సవరించి, వ్యవస్థలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూస్తేనే పౌరులకు నిజమైన ఉపశమనం లభిస్తుంది.



## గులాబీ దళంలో మళ్లీ జోష్..
# రోహిత్ రెడ్డి గ్రాండ్ రీ ఎంట్రీ!

**తాండూరు,ఆగష్టు 17(సిరి న్యూస్):**

తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి చాలా కాలం తర్వాత తాండూరులో అడుగుపెట్టడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో సందడి నెలకొంది. ఆయనకు పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన గులాబీ శ్రేణులతో పట్టణంలోని ప్రధాన ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. రోహిత్ రెడ్డిపై అభిమానాన్ని నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ప్రదర్శించారు.

తాండూరుకు చేరుకునే ముందు రోహిత్ రెడ్డి అనంతగిరిలోని పద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆయనకు ఘన స్వాగతం పలికి, భారీ గజమాలతో సన్మానించారు. అనంతరం రాజీవ్ కాలనీలోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం తాండూరు పట్టణంలోని విలియం మూన్ చౌరస్తాకు చేరుకున్న రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు గదను బహూకరించారు. భారీగా తరలివచ్చిన గులాబీ శ్రేణులతో చౌరస్తా జనసంద్రమైంది. కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ రోహిత్ రెడ్డికి భారీ గజమాల వేసి ఘనంగా సన్మానించారు. విలియం మూన్ చౌరస్తా నుంచి రోహిత్ రెడ్డి తన నివాసం వరకు నడుచుకుంటూ వెళ్లగా, ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. దారిపొడవునా జేజేలు పలుకుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. బీఆర్ఎస్ శ్రేణులు చూపిన అభిమానానికి రోహిత్ రెడ్డి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. చాలా రోజుల విరామం తర్వాత ఆయన తాండూరులో పర్యటించడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపించింది.





# కళ్యాణ లక్ష్మి.. షాదీ ముబారక్ నిధులు విడుదల చేయాలి

- మొయినాబాద్‌లో బీఆర్ఎస్ నాయకుల ధర్నా

**మొయినాబాద్, ఆగస్టు 17 (సిరి న్యూస్)**

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద అర్హులైన పేద కుటుంబాలకు పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం మొయినాబాద్ మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. అర్హత ఉన్నప్పటికీ పలువురు లబ్ధిదారులు ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. పేదల సంక్షేమాన్ని విస్మరిస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు, రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, దా రెడ్డి వెంకట్ రెడ్డి మండల నాయకులు, నర్సోతం రెడ్డి, కౌన్సిలర్ లు కర్రోళ్ల శ్రీధర్ ,చదువు రాంచందర్, రవి యాదవ్,డప్పు రాజు, బసవపురం ఆంజనేయులు గౌడ్, గునుగుర్తి దర్శన్, షాబాద్ ప్రవీణ్, పూసల పరమేష్, కుమ్మరి రాము, పెంద్యాల శ్రీనివాస్, ప్రవీణ్ రెడ్డి, బత్తుల రాజేష్ గౌడ్, ఈదులకంటి రవి, చేవెళ్ల సునీల్, కుమ్మరి శ్రీనివాస్, రాకేష్, మరియు తదతర పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు వై జంక్షన్ పూర్తిస్థాయి మూసివేత..

- ఎమ్మెల్యే ఆదేశాలతో కదిలిన యంత్రాంగం. ఎమ్మెల్యే రోహిత్ రావుకు ధన్యవాదములు.
- వెను వెంటనే చర్యలు ప్రారంభించిన మున్సిపల్ పాలకవర్గం.
- కోమటిపల్లి, గొల్పర్తి గ్రామాల ప్రజలు సర్వీసు రోడ్డు ను ఉపయోగించుకోవాలి.

రామాయంపేట మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య • గరాజు గుప్తా.

- భారతీయ జనతా పార్టీ హర్షం
- ఎంపీ మాధవనేని రఘునందన్ రావు కృషికి అభినందనలు



**రామాయంపేట, ఆగస్టు 17 (సిరి న్యూస్)**

రామాయంపేట బైపాస్ వద్ద (ఆద్య హోటల్ ఎదురుగా) ఎట్టకేలకు వై జంక్షన్ రోడ్డు మూత పడింది. ప్రమాదాలకు నిలయంగా మారిన వై జంక్షన్ ను పూర్తిగా మూసివేయాలని ఒక వైపు అధికార పార్టీ ఎమ్మెల్యే ఒత్తిడి, మరోవైపు బిఆర్ఎస్, భారతీయ జనతా పార్టీ నాయకులు చేసిన ఆందోళనల దరిమిలా నేషనల్ హైవే అధికారులు సోమవారం నాడు పూర్తిగా సిమెంట్ గద్దెలతో మూసివేశారు. దీంతో ప్రజలతోపాటు, ఆయా పార్టీల నాయకులు ఊపిరి పీల్చుకున్నారు. మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు చేసిన కృషి కారణంగానే వై జంక్షన్ రోడ్డు మూత పడిందని అధికార పార్టీ నాయకులు చెబుతుండగా, అదేమీ లేదు తమ ఒత్తిడి, ఆందోళనల నేపథ్యంలో హైవే అధికారులు దిగివచ్చి రోడ్డు ను మూసి వేశారని బిజెపి, బిఆర్ఎస్ నాయకులు వ్యాఖ్యానించారు. ఏది ఏమైనా రామాయంపేట నేషనల్ హైవే-44పై వై జంక్షన్ వద్ద వరుసగా జరుగుతున్న ప్రమాదాల నివారణ కోసం అన్ని పార్టీలు చేపట్టిన సుదీర్ఘ పోరాటం ఫలించింది. ప్రమాదాల నివారణలో భాగంగా వై జంక్షన్‌ను పూర్తిస్థాయిలో మూసివేయడంపై భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్, బిఆర్ఎస్ హర్షం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా వై జంక్షన్ వద్ద జరుగుతున్న ప్రమాదాలపై భారతీయ జనతా పార్టీ రామాయంపేట ఆధ్వర్యంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, జంక్షన్‌ను మూసివేసి శాశ్వత ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సుదీర్ఘంగా పోరాటం చేసిందని, ఈ సమస్యను మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ప్రత్యేకంగా దృష్టిలోకి తీసుకుని, నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి వెంటనే ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించడం అభినందనీయమని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ శంకర్ గౌడ్ తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి వై జంక్షన్‌ను పూర్తిస్థాయిలో మూసివేయడం ప్రజల భద్రతకు ఎంతో కీలకమైన చర్య. ఈ చర్యతో భవిష్యత్తులో ప్రమాదాలను గణనీయంగా నివారించే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తమ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి నాయకత్వంలో చేసిన సుదీర్ఘ పోరాటానికి ఇది ఒక విజయమని, వై జంక్షన్ మూసివేత నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు రామాయంపేట పి ఎస్ సి చైర్మన్ బాధే చంద్రం తెలిపారు అదేవిధంగా, భవిష్యత్తులో కూడా నేషనల్ హైవేపై ప్రజల భద్రతకు అవసరమైన అన్ని శాశ్వత చర్యలను వేగంగా పూర్తి చేయాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

## మాజీ నక్సలైట్ నేత నరసింహారెడ్డి అస్తమయం..!

- శోక సంద్రములో మునిగిన చెల్మెడ గ్రామం.
- అంత్యక్రియలకు తరలివచ్చిన ప్రజానీకం.
- నక్సలైట్ ఉద్యమం నుంచి జనజీవన స్రవంతిలోకి..
- ప్రజా సేవలో ప్రత్యేక ముద్ర.
- చప్పేట నరసింహారెడ్డి మృతి మండలానికి తీరని లోటు..
- అంత్యక్రియల్లో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి.



**రామాయంపేట, (నిజాంపేట) ఆగస్టు 17 (సిరి న్యూస్)**

నిజాంపేట మండలం చల్మెడ మాజీ సర్పంచ్, మాజీ నక్సలైట్ నేత, ప్రజా నాయకుడు చప్పేట నరసింహారెడ్డి మృతి మండలానికి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నిర్వహించిన అంత్యక్రియల్లో ఆమె పాల్గొని పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గతంలో నక్సలైట్ ఉద్యమంలో పనిచేసిన నరసింహారెడ్డి అనంతరం జనజీవన స్రవంతిలో కలిసిపోయి ప్రజా బాట పట్టారని పద్మాదేవేందర్‌రెడ్డి గుర్తుచేశారు. గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన సమయంలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి సేవలందించారని అన్నారు. నరసింహారెడ్డి మృతి చల్మెడ గ్రామంతోపాటు మండల ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు.

# చెరువులు నిండాయి.. చేప పిల్లలు ఏవీ

**వానలు కురిశాయి చెరువులు, కుంటలు నిండాయి.. నీటి వనరులు జలకళను సంతరించుకున్నాయి. చేపల పెంపకానికి అనుకూల సమయం వచ్చేసింది. మత్స్యకారులు కూడా చేపల పెంపకానికి సిద్ధమయ్యారు. కానీ చేప పిల్లల కోసం మాత్రం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.**

- మత్స్యకారుల ఎదురుచూపులు.. మత్స్యశాఖ పంపిణీపై స్పష్టత కరవు.. చెరువులు నిండినా చేప పిల్లల జాడేది

**మెదక్ ఆగస్టు 17 సిరి న్యూస్**

జిల్లాలోని పలు చెరువులు, కుంటలు నీటితో నిండినప్పటికీ ఇప్పటివరకు చేప పిల్లల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కాకపోవడంపై మత్స్యకార సంఘాలు, ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఏటా వానాకాలంలో చెరువులు నిండిన వెంటనే చేప పిల్లలను నీటి వనరుల్లో విడుదల చేయాల్సి ఉండగా ఈసారి మాత్రం పంపిణీ ఎప్పుడు ప్రారంభమవుతుందో స్పష్టత లేకపోవడంతో మత్స్యకారుల్లో అయోమయం నెలకొంది. జిల్లాలో వేలాది కుటుంబాలకు మత్స్య వృత్తే జీవనాధారం. చెరువులు, కుంటల్లో చేపల పెంపకం ద్వారా వచ్చే ఆదాయంపైనే అనేక కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. ప్రభుత్వం చేప పిల్లలను సమకూర్చి అర్హత కలిగిన చెరువుల్లో విడుదల చేయడం ద్వారా మత్స్యకార సంఘాలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. వానాకాలంలో చెరువుల్లో నీరు చేరిన వెంటనే చేప పిల్లలను వదిలితే వాటికి ఎదిగేందుకు ఎక్కువ సమయం లభిస్తుంది. అనంతరం చేపలు తగిన పరిమాణానికి చేరుకున్నప్పుడు మత్స్యకారులు చేపల వేట చేపట్టి ఆదాయం పొందుతారు. దీంతో చేప పిల్లల విడుదల సమయం మత్స్యకారుల ఉపాధితో నేరుగా ముడిపడి ఉంది.

### నీరు వచ్చింది చేప పిల్లలు రాలేదు

జిల్లాలోని అనేక చెరువులు, కుంటల్లో నీరు చేరడంతో మత్స్యకారులు చేపల పెంపకంపై ఆశలు పెట్టుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి నీటి వనరులు నిండిన సమయంలోనే చేప పిల్లలను చెరువుల్లో వదిలితే వాటి ఎదుగుదలకు ఎక్కువ సమయం ఉంటుంది. చేప పిల్లలు త్వరగా ఎదిగి పెద్ద చేపలుగా మారేందుకు వాతావరణం కూడా అనుకూలంగా ఉంటుంది. కానీ చెరువుల్లో నీరు చేరి రోజులు గడుస్తున్నా చేప పిల్లల పంపిణీపై స్పష్టత లేకపోవడంతో మత్స్యకారులు నిరాశకు గురవుతున్నారు. ''చెరువుల్లో నీళ్లు ఉన్నాయి.. చేపలు పెంచేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి.. మత్స్యకారులు సిద్ధంగా ఉన్నారు.. మరి చేప పిల్లలు ఎప్పుడు వస్తాయి అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. చేప పిల్లల విడుదలలో మరింత జాప్యం జరిగితే వాటి ఎదుగుదలకు లభించే సమయం తగ్గిపోతుందని, దాని ప్రభావం చేపల ఉత్పత్తిపైనే కాకుండా తమ ఆదాయంపైనా పడుతుందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని చేపల పెంపకం కేంద్రం, చేప విత్తనోత్పత్తి కేంద్రాలు, హేచరీల నుంచి అవసరమైన చేప పిల్లలను సమకూర్చి జిల్లాలోని ఎంపిక చేసిన చెరువులు, కుంటలకు పంపిణీ చేయాల్సి ఉంటుంది. చేప పిల్లలను ఉత్పత్తి చేసి పెంచే కేంద్రాలను సాధారణంగా చేప విత్తనోత్పత్తి కేంద్రాలు లేదా హేచరీలు అంటారు. అక్కడ ఉత్పత్తి చేసిన చేప విత్తనాలను నిర్దేశిత నీటి వనరులకు తరలించి విడుదల చేస్తారు. అయితే మెదక్ జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు చేప పిల్లల పంపిణీ ప్రక్రియపై స్పష్టమైన సమాచారం లేకపోవడంతో మత్స్యకారులు మత్స్యశాఖ అధికారుల వైపు చూస్తున్నారు. ఏయే చెరువులకు ఎన్ని చేప పిల్లలు కేటాయిస్తారు ఏ తేదీ నుంచి పంపిణీ ప్రారంభిస్తారు మత్స్యకార సంఘాలకు ఎప్పుడు అందిస్తారు అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు. చేప పిల్లల పంపిణీ ఆలస్యం అయితే దాని ప్రభావం నేరుగా చేపల పంటపై పడే అవకాశం ఉందని మత్స్యకారులు చెబుతున్నారు. సకాలంలో చేప పిల్లలను చెరువుల్లో వదిలితే అవి వానాకాలం, శీతాకాలం వరకు పెరిగి తగిన పరిమాణానికి చేరుకునే అవకాశం ఉంటుంది. ఆలస్యంగా విడుదల చేస్తే చేపలు ఎదిగేందుకు తగిన సమయం లేకపోవడంతో చిన్న పరిమాణంలోనే ఉండిపోయే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో మార్కెట్‌కు చేపలను తరలించే సమయంలో ఆశించిన దిగుబడి రాకపోవచ్చని, ఫలితంగా ఆదాయం తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వలలు, ఇతర మత్స్య పరికరాలతో సిద్ధంగా ఉన్న మత్స్యకారులు చేప పిల్లల విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. చేప పిల్లల పంపిణీకి ముందు జిల్లాలోని ప్రతి చెరువు కుంట సామర్థ్యాన్ని పరిశీలించి ఎంతమేర చేప పిల్లలు అవసరమో అధికారులు నిర్ధారించాలని మత్స్యకార సంఘాలు కోరుతున్నాయి. నీటి నిల్వ, చెరువు విస్తీర్ణం, గతంలో చేపల పెంపకం జరిగిన తీరు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కేటాయింపులు చేయాలని అంటున్నారు. చేప పిల్లల నాణ్యతపైనా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు. పంపిణీ సమయంలో చేప పిల్లల పరిమాణం, సంఖ్య, నాణ్యతను మత్స్యకార సంఘాల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించి చెరువుల్లో విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కేవలం కాగితాలపై పంపిణీ పూర్తయినట్లు కాకుండా.. వాస్తవంగా ఏ చెరువుకు ఎన్ని చేప పిల్లలు చేరాయి వాటిని ఎప్పుడు వదిలారు అనే వివరాలు నమోదు చేయాలని కోరుతున్నారు. మత్స్యకార సంఘాలు, ముదిరాజ్ సంఘాల సభ్యులు తమ జీవనోపాధి కోసం ప్రభుత్వం అందించే చేప పిల్లలపై ఆధారపడుతున్నారు. చెరువులు, కుంటలు నిండిన సమయంలో చేప పిల్లలను వదిలితేనే ప్రభుత్వం ఉద్దేశించిన మత్స్య సంపద అభివృద్ధి లక్ష్యం నెరవేరుతుందని వారు చెబుతున్నారు. చేప పిల్లల పంపిణీ ఆలస్యం అయితే నీటి వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ వాటి ద్వారా ఆశించిన ప్రయోజనం పొందలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది సకాలంలో చేప పిల్లలను అందించి తమకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి కేటాయింపులు, సరఫరా, నాణ్యత పరిశీలన, చెరువుల ఎంపిక వంటి ప్రక్రియలు ఏ దశలో ఉన్నాయో అధికారులు వెల్లడించాల్సి ఉంది. జిల్లాలో ఎన్ని చెరువులకు చేప పిల్లలు పంపిణీ చేయాల్సి ఉంది మొత్తం ఎన్ని చేప పిల్లలు అవసరం సరఫరా ఎక్కడి నుంచి జరుగుతుంది పంపిణీకి ఎప్పుడు శ్రీకారం చుడతారు అనే అంశాలపై మత్స్యకారుల్లో ఆసక్తి నెలకొంది. ఈ వివరాలను అధికారులు వెల్లడిస్తే మత్స్యకారులకు కూడా తమ చేపల పెంపకంపై ముందస్తు ప్రణాళిక చేసుకునే అవకాశం ఉంటుంది.

చెరువులు నిండిన తర్వాత కూడా చేప పిల్లల పంపిణీ ఆలస్యం చేస్తే ఈ ఏడాది చేపల పంటపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వర్షాలు సమృద్ధిగా కురిసి నీటి వనరులు నిండినందున ఇక ఆలస్యం చేయకుండా వెంటనే చేప పిల్లలను విడుదల చేయాలని కోరుతున్నారు. జిల్లాలోని అన్ని అర్హత కలిగిన చెరువులు, కుంటలకు అవసరమైన మేర చేప పిల్లలను అందించి మత్స్యకారుల ఉపాధికి భరోసా కల్పించాలని మత్స్యకార సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఇప్పటికైనా జిల్లా మత్స్యశాఖ అధికారులు స్పందించి జిల్లాలోని చెరువులు, కుంటల పరిస్థితిని సమీక్షించి, అవసరమైన చేప పిల్లల సంఖ్యను నిర్ధారించి, చేప విత్తనోత్పత్తి కేంద్రాలు, హేచరీల నుంచి నాణ్యమైన చేప పిల్లలను సమకూర్చి సకాలంలో పంపిణీ చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు. చెరువులు సిద్ధంగా ఉన్నాయి.. నీరు అందుబాటులో ఉంది.. మత్స్యకారులు సిద్ధంగా ఉన్నారు.. ఇక చేప పిల్లలు మాత్రమే రావాల్సి ఉంది. మరి మెదక్ జిల్లాలో చేప పిల్లల పంపిణీ ఎప్పుడు ప్రారంభమవుతుంది? చెరువుల్లో చేప పిల్లలు ఎప్పుడు చేరుతాయి మత్స్యకార సంఘాలకు ఎప్పుడు అందుతాయి అనే ప్రశ్నలకు మత్స్యశాఖ అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది. మరింత ఆలస్యం కాకుండా వెంటనే పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మత్స్యకారుల ఉపాధికి భరోసా కల్పించాలని సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.






# సైబర్ అవగాహనలో ప్రతిభచాటిన గీతం విద్యార్థులు

- సురక్షా కా తిరంగా' కార్యక్రమంలో ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున చేతుల మీదుగా పురస్కారం

**పటాన్ చెరు, ఆగస్టు 17, (సిరి న్యూస్):**



ఆన్ లైన్ సైబర్ నేరాలను నిరోధించేలా నిర్వహించిన రాష్ట్ర స్థాయి షార్ట్ వీడియో, రీల్ పోటీలో హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు అగ్రస్థానం సాధించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ) తన స్పార్క్ (అవగాహన, బాధ్యతాయుతమైన సైబర్ స్పేస్ కోసం విద్యార్థి కార్యక్రమం)లో భాగంగా 'సురక్షా కా తిరంగా, (అప్రమత్తంగా ఉండండి, క్షుణ్ణంగా తెలుసుకోండి, సైబర్ సురక్షితంగా ఉండండి') పేరిట బంజారాహిల్స్ లోని ఇంటిగ్రెటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో ఈ పోటీలను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ టాలీవుడ్ నటుడు అక్కినేని నాగార్జున, తెలంగాణ పోలీసు డైరెక్టర్ జనరల్ సి.వి. ఆనంద్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, హైదరాబాదు పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనార్ సహా పలువురు ప్రముఖులు, సీనియర్ పోలీసు అధికారులు హాజరయ్యారు. 'మోసాల నుంచి స్వేచ్ఛ' అనే ఇతి వృత్తంతో స్వాతంత్ర్య దినోత్సవ సైబర్ అవగాహన ప్రచారంలో భాగంగా, విద్యార్థులు, ప్రజలు సురక్షితమైన డిజిటల్ పద్ధతులను అవలంబించేలా, సైబర్ బెదిరింపుల పట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రోత్సహించడానికి, ఆన్ లైన్ మోసాలను నివారించడం పై అవగాహన కల్పించడానికి టీజీసీఎస్బీ రాష్ట్ర వ్యాప్తంగా ఒక లఘు వీడియో, రీల్ పోటీని నిర్వహించింది. హైదరాబాదు ప్రాంగణంలోని గీతం స్కార్క్ క్లబ్ ఈ రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొని, తమ ప్రభావవంతమైన సృజనాత్మక ప్రదర్శనకు ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. సైబర్ భద్రతను, బాధ్యతాయుతమైన డిజిటల్ ప్రవర్తనను ప్రోత్సహించడంలో వారు చేసిన కృషికి గుర్తింపుగా, ఈ కార్యక్రమంలో గీతం విద్యార్థులకు ప్రముఖుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. సైబర్ అవగాహన ప్రచారానికి విద్యార్థులు చేస్తున్న కృషికి మద్దతు నిచ్చిన సంగారెడ్డి డీఎస్పీ వేణుగోపాలరెడ్డి సహకారంతో గీతం జట్టు ఈ పోటీలలో పాల్గొంది. సురక్షితమైన, మరింత బాధ్యతాయుతమైన డిజిటల్ వాతావరణాన్ని సృష్టించే లక్ష్యంతో చేపట్టిన ఈ పోటీలలో విద్యార్థులు చూపిన సృజనాత్మకత, అవగాహన, చురుకైన భాగస్వామ్యానికి గీతం నాయకత్వం వారిని అభినందించింది. ఈ విజయం, గొప్ప సామాజిక చైతన్యం కల్పించడం కోసం తమ జ్ఞానాన్ని, ప్రతిభను వినియోగించడం లో గీతం విద్యార్థుల కున్న నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ లోని కృత్రిమ మేధస్సు-డేటా సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.శశివర్ణన్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. రాష్ట్ర స్థాయిలో లభించిన ఈ గుర్తింపు గీతం కు గర్వకారణ మే గాక, సైబర్ అవగాహన, బాధ్యతాయుతమైన సాంకేతిక వినియోగం, సామాజిక ప్రాముఖ్యత గల కార్యక్రమాలలో విద్యార్థుల భాగస్వామ్యంపై విశ్వవిద్యాలయం నిరంతరం చూపుతున్న ప్రాధాన్యతను ఇది నొక్కి చెబుతుంది.

# తిరుపతి పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్





**పటాన్ చెరు, ఆగస్టు 17, (సిరి న్యూస్):**

పటాన్ చెరు పట్టణానికి చెందిన సీసాల రాజు ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహిస్తున్న పటాన్ చెరు–తిరుపతి పాద యాత్రను సోమవారం ఉదయం పట్టణం లోని మహంకాళి దేవాలయం వద్ద పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. భక్తి శ్రద్ధలతో వరుసగా 22 సంవత్సరాలుగా తిరుపతికి పాదయాత్ర నిర్వహించడం అభి నందనీయమని అన్నారు. ఆధ్యాత్మిక విశ్వాసంతో చేపడుతున్న ఈ పాదయాత్ర విజయవంతంగా సాగాలని, యాత్రికు లందరి కీ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. అనంతరం కిష్టారెడ్డి పేట కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు మాణిక్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరుపతి పాదయాత్రను కూడా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారు సురక్షితంగా తిరుపతి చేరుకుని స్వామి వారిని దర్శించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్య క్రమంలో మాజీ సర్పంచ్ సపాన్ దేవ్ ముదిరాజ్, ఎం డీ ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు మాదిరి పృథ్వి రాజ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. బీరం గూడ వద్ద స్వాగతం పలికిన ఆదర్శ్ రెడ్డి పటాన్‌చెరు పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో సీసాల రాజు నేతృత్వంలో పటాన్‌చెరు మహంకాళి మందిరం నుంచి తిరుమల తిరుపతికి 22వ మహా పాదయాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా పటాన్ చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి బీరంగూడ కమాన్ వద్ద పాదయాత్ర చేస్తున్న భక్తులను కలుసుకుని, వారితో మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు భక్తులం దరిపై ఉండాలని, పాదయాత్ర విజయ వంతంగా, సురక్షితంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర స్వామి భక్త బృందం సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. అలగే ఇదే కార్యక్రమంలో పటాన్ చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ సోదరుడు మెట్టు ఎల్లేష్ యాదవ్ కూడా పాల్గొన్నారు. అనంతరం పటాన్ చెరు నియోజకవర్గం పరిధిలోని కృష్ణారెడ్డిపేట వాస్తవ్యులు మాణిక్యం వెంకటేశ్వర స్వామి భక్త బృందం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 6వ మహా పాదయాత్ర కార్యక్రమంలో మెట్టు ఎల్లేష్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిష్టారెడ్డిపేట లోని దుర్గా మాత ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మెట్టు ఎల్లేష్ యాదవ్ జెపి కాలనీ డివిజన్ పరిధిలోని నాగులమ్మ గడ్డ కాలనీలో గల శ్రీ నాగులమ్మ అమ్మ వారి ఆలయాన్ని దర్శించుకోనీ ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో , శ్రీనివాస్, అజ్మత్ అజ్జు, కార్తీక్, మిల్క్ రవి, మెట్టు కళ్యాణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ సమరభేరి..







- **కూకట్‌పల్లి నియోజకవర్గంలో కదిలిన గులాబీ దండు..**
- **ఆడబిడ్డల పథకాలు వెంటనే ఇవ్వాలి..**
- **పేదల పెన్షన్లు పునరుద్ధరించాలి..**
- **హామీలు నెరవేర్చే వరకు ఉద్యమం ఉధృతం..**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 17 (సిరి న్యూస్):**

కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు మూసాపేట్, అల్లాపూర్, ఫతేనగర్, బాలానగర్, ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్లలో బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు ఏకకాలంలో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నాలు చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్ర హావేశాలు వ్యక్తం చేశారు. కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులు పెండింగ్‌లో మగ్గుతుండటం, నిరుపేదల పెన్షన్లు తొలగించడం, కేసీఆర్ కిట్ పంపిణీలో జాప్యంపై నినాదాలతో వీధులు హోరెత్తించారు. పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాలను తక్షణమే అమలు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియో జకవర్గ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, మహిళా నాయకు రాళ్లతో పాటు వందలాది మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నిరసన స్వరం వినిపించారు..



# అధికారుల నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలి

- **ప్రభుత్వం బాధ్యత వహించాలి.**
- **మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి...**

**పాపన్నపేట ఆగస్టు 17 సిరి న్యూస్:**



ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యంతో పాపన్నపేట గ్రామపంచాయతీ కారోబార్ ఆకుల కృష్ణ ప్రాణం పోయిందని, దీనికి ప్రభుత్వం బాధ్యత వహించి కుటుంబాన్ని ఆదుకోవాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల మండల పరిధిలోని యూసుపేట శివార్ లో రోడ్డు ప్రమాదంలో మరణించిన కరోబారు ఆకుల కృష్ణ కుటుంబ సభ్యులను, సోమవారం నాడు పాపన్న పేటలో పరామర్శించి ఓదార్చారు.. సందర్భంగా మాట్లాడుతూ మెదక్ నుండి పాపన్నపేట ప్రధాన రహదారి అక్కడక్కడ గుంతల మయమైంది. ఈ గుంతలతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్న అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఆకుల కృష్ణ ప్రమాదానికి రోడ్డు గుంతే ప్రధాన కారణమన్నారు. ఈ ప్రమాదానికి ప్రభుత్వం బాధ్యత వహించి కృష్ణ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంచాయతీలో కారోబార్ గా కృష్ణ విధులు నిర్వహిస్తు మరణించి నందున పంచాయతీరాజ్ శాఖలో కానీ , ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ లో కానీ కృష్ణ భార్యకు ఉద్యోగం కల్పించాలన్నారు. వీరి వెంట బీ.ఆర్.ఎస్ పార్టీ జిల్లా నాయకులు పోతే దార్ మల్లన్న. మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు మహిపాల్. మాజీ ఏడుపాయల డైరెక్టర్లు కిషన్ రెడ్డి. సుంకరి కృష్ణ. కుమ్మరి పోచయ్య. నాయకులు, బి కొండ రాములు బాల్ రాజ్, రంగంపేట శీను, టప్ప రాములు. తదితరులు ఉన్నారు..

# జన్కపూర్‌కు పంచాయతీ భవనం..

- **రూ.20 లక్షలతో పంచాయతీ భవనం..**
- **జన్కపూర్ అభివృద్ధికి మరో అడుగు..**
- **ఎమ్మెల్యే వినోద్‌కు గ్రామస్థుల కృతజ్ఞతలు..**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 17 (సిరి న్యూస్)**



మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం జన్కపూర్ గ్రామంలో నూతన గ్రామపం చాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.20 లక్షల నిధులతో శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి సొంత పంచాయతీ కార్యాలయ భవనం అందుబాటులోకి రానుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించిన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట స్వామికి, అభివృద్ధి కార్యక్రమాలకు నిరంతరం కృషి చేస్తున్న మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు మాధవరపు నర్సింగ రావుకు గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్పుల మల్లేష్, బెల్లంపల్లి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎల్పుల రోహిత్, జన్కపూర్ గ్రామ సర్పంచ్ బోరిగామ వెంకటేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోరిగామ జలపతి, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పప్పుల రామాంజనేయులు, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బట్టు శ్రీను పాల్గొన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయ భవనం పూర్తయితే ప్రజలకు పరిపాలనా సేవలు మరింత సులభంగా అందుబా టులోకి వస్తాయని నాయకులు పేర్కొన్నారు.

## రేషన్ కార్డుపై మోదీ ఫోటో.. బీజేపీ రగడ!..

- **స్మార్ట్ రేషన్ కార్డుపై మోదీ ఫోటో తప్పనిసరి..**
- **అర్హులందరికీ కొత్త కార్డులు ఇవ్వాలి..**
- **ఫోటో లేకుంటే ఉద్యమం ఉధృతం!..**



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 17 (సిరి న్యూస్)**

తెలంగాణ ప్రభుత్వం కొత్తగా జారీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో తప్పనిసరిగా ముద్రించాలని డిమాండ్ చేస్తూ నెన్నెల మండల బీజేపీ నాయకులు ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు నెన్నెల మండల బీజేపీ అధ్యక్షుడు అంగలి శేఖర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఎలాంటి జాప్యం లేకుండా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని నాయకులు కోరారు. కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి నెలకు 5 కిలోల ఉచిత బియ్యం అందిస్తోందని, దాంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 9 రకాల నిత్యావసర సరుకులను అర్హులైన లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీల ప్రజలకు రేషన్ సరుకులు పొందేందుకు ఇబ్బందులు లేకుండా ఆయా గ్రామపంచాయతీల పరిధిలో కొత్త రేషన్ దుకాణాలను మంజూరు చేయాలని కోరారు. ప్రజలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో ముద్రించకుండా కార్డులు జారీ చేస్తే చూస్తూ ఊరు కోబోమని బీజేపీ నాయకులు హెచ్చరించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చు కోకపోతే ధర్నాలు, నిరసనలు, ప్రజా ఉద్యమాలు చేపట్టి పోరాటాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శైలేందర్ సింగ్ ఠాకూర్, నల్ల రాజేందర్, ఎండీ షఫీ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## నాగులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

**మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్**



**రామచంద్రాపురం, ఆగస్టు 17 (సిరి న్యూస్):**

నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని రామచంద్రాపురం డివిజన్ ఓల్డ్ రామచంద్రాపురంలోని నాగులమ్మ ఆలయంలో మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగదేవత పుట్టలో పాలు పోసి, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా బూరుగడ్డ పుష్పనగేష్ మాట్లాడుతూ.. నాగుల పంచమి పర్వదినం సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం, శ్రేయస్సు, శాంతి, ఆరోగ్యాన్ని నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

## నాగుల పంచమి సందర్భంగా నాగదేవతకు ప్రత్యేక పూజలు

**రామచంద్ర రెడ్డి నగర్ లో పూజలు నిర్వహించిన మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి**

**రామచంద్రాపురం, ఆగస్టు 17 (సిరి న్యూస్) :**



నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరిం చుకుని భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి రామచంద్ర రెడ్డి నగర్‌లోని నాగుల పుట్టను సందర్శించి నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్ర ద్ధలతో పూజలు చేసి ప్రజలందరూ ఆయురా రోగ్యాలతో, సుఖసంతో షాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా సింధు ఆదర్శ్ రెడ్డి ప్రజలకు నాగుల పంచమి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. నాగదేవత ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం, ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

# పసిపాపపై పైశాచీకం నిందితుడు అరెస్ట్

## రెండేళ్ల చిన్నారితో చిల్లర చేష్టలు

## నరరూప రాక్షసుడికి కటకటాలు




**అమీన్పూర్ ఆగస్టు 17 సిరి న్యూస్**

అమీన్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గండిగూడెం గ్రామంలో విషాద సంఘటన చోటు చేసుకుంది. సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నిన్న రాత్రి 8:30 నిమిషాల సమయంలో రఘునాథ్ అనే నిందితుడు గండిగూడెం చౌరస్తాకు చెందిన రెండేళ్ల చిన్నారి, తన ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో, ఆ చిన్నారికి మాయ మాటలు చెప్పి సుమారు 500 మీటర్ల దూరంలో ఉన్న ఐలాపూర్ తాండ శివారులోనీ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి ఆ చిన్నారిపై లైంగిక దాడికి ప్రయత్నించగా, చిన్నారి ఎక్కిళ్ళు పట్టి ఏడుస్తున్న విషయాన్ని కార్మికులు విధులు ముగించుకుని ఇంటికి వస్తున్న సమయంలో ఆ ప్రాంత శివారు నుండి ఏడుపు విన్న శశి కుమార్ ఘటన స్థలానికి వెళ్ళాడు అతనితో తగాధపడి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితున్ని పట్టుకొని పలు సెక్షన్లపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించాం, అని తెలిపారు.

# నర్సాపూర్–యాదగిరిగుట్ట బస్సు సర్వీసు ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాజిరెడ్డి




**వెల్దుర్తి,ఆగస్టు 17,( సిరి న్యూస్) :**

నర్సాపూర్ నుండి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి వయా వెల్దుర్తి మండల కేంద్రం నుండి బస్సు సౌకర్యం సోమవారం నాడు అంగరంగ వైభవంగా వెల్దుర్తి మండలం మంగళపర్తి, కుకునూర్, ఆరెగూడెం, వెల్దుర్తి పట్టణ కేంద్రంలో గ్రామ ప్రజలు నాయకుల మధ్య ఆవుల రాజిరెడ్డి ప్రారంభించారు. నర్సాపూర్ నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం నర్సాపూర్ నుండి తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి నూతన బస్సు సర్వీసును సోమవారం నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి అలాగే యాదగిరిగుట్ట డైరెక్టర్ రాఘవేంద్రరావు, జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మహేష్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్,అధ్యక్షతన ప్రారంభించారు. ఈ బస్సు సర్వీసు నర్సాపూర్ – వెల్దుర్తి – తూప్రాన్ – గజ్వేల్ మీదుగా యాదగిరిగుట్ట వరకు కొనసాగనుంది. దీంతో నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలకు అలాగే ముఖ్యంగా వెల్దుర్తి మండల ప్రజలకు తూప్రాన్,గజ్వేల్, యాదగిరిగుట్టకు,వెళ్లేందుకు మరింత సౌకర్యవంతమైన రవాణా సదుపాయం అందుబాటులోకి వచ్చింది అని నాయకులు సంబరాలు చేసుకున్నారు. యాదగిరిగుట్టకు వెళ్లే భక్తులు, వృద్ధులు, మహిళలు, నియోజకవర్గ ప్రజలకు ఈ బస్సు సర్వీసు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. వెల్దుర్తి మండల కేంద్రనికి బస్సు సర్వీసు రాగానే డప్పు చప్పుళ్ల మధ్య సంబరాలు చేసుకుంటూ గ్రామ సర్పంచ్ ఆదర్శ్, ఉప సర్పంచ్ శ్రవణ్ కుమార్, అధ్యక్షతన గ్రామస్తులు బస్సు సర్వీసు కు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ శివారు వరకు బస్సును ర్యాలీగా పంపించారు. ఇట్టి సర్వీస్కు ఎంతో కృషి చేసిన మంగలపర్తి గ్రామ వాస్తవ్యులు రాఘవేంద్రరావును కొమిరిశెట్టి రమేష్ గుప్తా శాలువాతో సత్కరించారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామస్తులు గ్రామ నాయకులు అలాగే ప్రయాణికులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాల నేలమట్టం విలువైన ప్రభుత్వ భూమికి విముక్తి




**అమీన్పూర్ ఆగస్టు 17 సిరి న్యూస్**

అమీన్పూర్ మండల పరిధిలోని భూదాన్ ల్యాండ్ మరియు సర్వేనెంబర్ 30 సుల్తాన్పూర్ విలేజ్ లో కబ్జాకు గురైన విషయాన్ని తెలుసుకొని సోమవారం తహసిల్దార్ వెంకటేష్ ఆదేశాల మేరకు ఆర్ఐ సంగీత జెసిబి లతో కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసిల్దార్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది ఆక్రమంగా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు మా దృష్టికి వచ్చింది అని తెలిపారు. విలువైన ప్రభుత్వ భూమిని కొంతమంది రాత్రికి రాత్రి అక్రమంగా చొరబడి నిర్మాణాలు చేపట్టడంతో సోమవారం తెల్ల వారుజామున పూర్తిగా నేలమట్టం చేసాం అని తెలిపారు. ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించిన ఉపేక్షించేది లేదు, ప్రభుత్వ భూములో అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారైనా సరే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

# ఘనంగా శేరి సుభాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు

## తెలంగాణ ఉద్యమంలో ఆయన సేవలు మరువలేనివి.

**రామాయంపేట, ఆగస్టు 17 (సిరి న్యూస్)**

మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు శేరి సుభాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం రామాయంపేటలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి శేరి సుభాష్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని, భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానాలకు ఎదిగి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రామాయంపేట పీఏసీఎస్ చైర్మన్ బాదే చంద్రం, మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, కౌన్సిలర్ చౌదరి చరిత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో శేరి సుభాష్‌రెడ్డి అందించిన సేవలను గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ కోసం జరిగిన ఉద్యమంలో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తనవంతు పాత్ర పోషించారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన కృషి చేశారని అన్నారు. తెలంగాణ ఉద్యమం నుంచి నేటి వరకు, కెసిఆర్ అడుగుజాడల్లో ప్రజలతో మమేకమై పనిచేసిన నాయకుల్లో శేరి సుభాష్‌రెడ్డి ఒకరని వారు పేర్కొన్నారు. పదవులు ఉన్నా లేకపోయినా ప్రజా సమస్యలపై స్పందిస్తూ, పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పనిచేయడం ఆయన ప్రత్యేకత అని అన్నారు. పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తూ బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో కూడా ఆయన రాజకీయ, ప్రజా జీవితంలో మరింత చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా రామాయంపేట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకున్నారు. శేరి సుభాష్‌రెడ్డి ప్రజా సేవలో మరింత కాలం కొనసాగాలని, ఆయనకు మంచి ఆరోగ్యం, ఆనందం, విజయాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్మ ద్దెల మాధవి రమేష్, పార్టీ నాయకులు బసన్నపల్లి రాజు యాదవ్, ఉమామహేశ్వర్, హైమద్, హస్నుద్దీన్, శ్రీకాంత్ సాగర్, కన్నాపురం కృష్ణగౌడ్, విద్యాకర్, తాటిపల్లి రాంకీ, మధుకర్, పాతూరి సిద్ధరాములు, దాకి శ్రీనివాస్, నవత్ మహేష్, నర్సింగ్‌రావు, సుభాష్ రాథోడ్, అల్లాడి వెంకటేష్, పాతూరి సాయి, నరేందర్‌రెడ్డి, శ్రవణ్‌గౌడ్, శ్రీకాంత్ బబ్లు, పాపయ్యగారి నర్సింలు, మార్కు రాజు, కన్నాపురం సందీప్‌గౌడ్, చంద్రం, కొక్కు స్వామి, సిద్ధరాములు తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# వెల్దుర్తి మండల కేంద్రానికే తెలంగాణ పబ్లిక్ స్కూల్







- 20 రోజులుగా నిరసనలు
- ప్రజల న్యాయమైన డిమాండ్ ను పరిష్కారం చేయాలంటూ న్యాయమైన పోరాటం

**వెల్దుర్తి, ఆగస్టు 17, (సిరి న్యూస్ ):**

గత 20 రోజులుగా తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను వెల్దుర్తి మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని మండల యువ నాయకులు, గ్రామస్తులు, నిరంతర పోరాటం కొనసాగిస్తున్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ సాధన కోసం వెల్దుర్తి మండల కేంద్రం యువత చేయని ప్రయత్నం లేదు.. కలవని అధికారి లేరు.. సంప్రదించని నాయకుడు లేరు. ప్రజాప్రతినిధులను, ఇన్‌చార్జి మంత్రిని, మాజీ ఎమ్మెల్యేలను, ప్రస్తుత ఎమ్మెల్యేలను, జిల్లా కలెక్టర్ ను,కలిసి ఎన్నో వినతులు, విన్నపాలు అందించారు. రిలే నిరాహార దీక్షలు కూడా కొనసాగిస్తున్నారు. రోజుకు ఒక కుల సంఘం ఈ న్యాయ పోరాటం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. అయినప్పటికీ మా మొరను ఆలకించేది ఎవరు? మా న్యాయమైన డిమాండ్‌పై స్పందించేది ఎవరు? అంటూ మండల యువత, గ్రామస్తులు, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల యువత,ఆకాంక్షను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు, ధర్నాలు, వినతిపత్రాలు నిర్వహిస్తున్నారు. ఈ మధ్యకాలంలో అభివృద్ధి చెందుతున్న వెల్దుర్తి మండలం ఒకసారి మోడల్ స్కూలు తూప్రాన్ కు వెళ్లిపోవడంతో గ్రామస్తులు కొంత నిరాశ చెందారు. తిరిగి మరల ఇప్పుడు కూడా వేరే గ్రామానికి వెళ్ళిపోతే మండల కేంద్రమైన వెల్దుర్తి అభివృద్ధిలో కుంటుపడుతుందని నాయకులు,యువత, గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గత ఐదు రోజులుగా వెల్దుర్తి చౌరస్తా వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టి వారి డిమాండ్‌ను మరింత బలంగా ప్రభుత్వానికి వినిపిస్తున్నారు. వెల్దుర్తి మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు అనుకూలంగా చుట్టుపక్కల గ్రామాల ప్రస్తుత సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారు. ముఖ్యంగా ప్రజలు స్వచ్ఛందంగా నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటూ తమ ఆకాంక్షను స్పష్టంగా తెలియజేస్తున్నారు. వెల్దుర్తి మండల కేంద్రంలోనే స్కూల్ ఏర్పాటు చేస్తే మండలంలోని అనేక గ్రామాల విద్యార్థులకు సులభమైన రవాణా సౌకర్యం, మెరుగైన విద్యా అవకాశాలు, అన్ని మౌలిక వసతుల అందుబాటు కలుగుతుంది. ఇప్పటికే మండల కేంద్రంలో అనువైన స్థలం, అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్న విషయాన్ని కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.అని నాయకులు యువత అంటున్నారు. అందుకే అధికారులు, ప్రభుత్వం ఈ అంశాన్ని పునఃపరిశీలించి, సమగ్రంగా సర్వే నిర్వహించి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను వెల్దుర్తి మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని మండల కేంద్ర ప్రజలు కోరుకుంటున్నారు. ఇది ఎవరి వ్యక్తిగత డిమాండ్ కాదు. ఇది రాజకీయ ప్రయోజనం కోసం చేస్తున్న పోరాటం కాదు మన పిల్లల భవిష్యత్తు కోసం వెల్దుర్తి ప్రజలు చేస్తున్న న్యాయమైన పోరాటం. వెల్దుర్తి మండల కేంద్రానికే తెలంగాణ పబ్లిక్ స్కూల్ —— ఇదే మా డిమాండ్.. ఇదే ప్రజల ఆకాంక్ష! అని యువత రోడ్లపైనే బైఠాయి ఇస్తున్నారు. ప్రజల గొంతును ప్రభుత్వం ఆలకించాలి.. వెల్దుర్తికే తెలంగాణ పబ్లిక్ స్కూల్ మండల కేంద్రంలోని నిర్వహించాలంటూ ఏకకంఠంతో మండల కేంద్ర ప్రజలు ఉన్నారని వారు వెల్లడించారు.

# చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి

**తూప్రాన్ ఆగస్టు 17 సిరి న్యూస్**

తూప్రాన్ మండలంలోని నాగులపల్లి గ్రామ శివారులోని అల్లి వాగులో ఆదివారం రాత్రి చేపలు పట్టడానికి వెళ్లిన ఒరిస్సా రాష్ట్రానికి చెందిన చేతన్ అనే యువకుడు విద్యుత్ వైర్లతో చేపలు పడుతుండగా విద్యుత్ వైరు తగిలి నీటిలో పడి మృతి చెందినట్లు పోలీసులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టిన బాడీని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తూప్రాన్ ఎస్ఐ గంగరాజు తెలిపారు



# వరికే నీటి గండం!..ప్రత్యామ్నాయ పంటలే మేలు..

- వరి వద్దు.. ప్రత్యామ్నాయ పంటలే ముద్దు..
- నీటి కొరతపై కలెక్టర్ హెచ్చరిక..
- మొక్కజొన్న.. పప్పుధాన్యాల వైపు మళ్లండి..
- నీటిని పొదుపుగా వాడి.. ఎక్కువ పంట పండించండి..




**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 17 (సిరి న్యూస్)**

వర్షపాతం తగ్గే అవకాశం, భూగర్భ జలమట్టాలు పడిపోతున్న నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. వరి సాగుకు అవసరమైనంత నీరు ప్రాజెక్టులు, జలాశయాల్లో అందుబాటులో ఉండకపోవచ్చని, ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని తెలిపారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో సోమవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో నీటిపారుదల శాఖ పర్యవేక్షక ఇంజినీర్ విష్ణు ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖతో కలిసి కలెక్టర్ మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున ఖరీఫ్‌తో పాటు రబీలోనూ నీటి సమస్యలు ఎదురయ్యే అవకాశముందని చెప్పారు. ఒక ఎకరా వరికి అవసరమయ్యే నీటితో మూడు నుంచి నాలుగు ఎకరాల్లో తక్కువ నీటితో సాగయ్యే పంటలను పండించవచ్చని తెలిపారు. వరి సాగు చేస్తే నీటి కొరతతో పంట ఎండిపోవడం, దిగుబడి, ధాన్యం నాణ్యత తగ్గే ప్రమాదం ఉందన్నారు. మొక్కజొన్న, కంది, పెసలు, మినుములు, అలసందులు వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను రైతులు ఎంచుకోవాలని సూచించారు. పప్పుధాన్యాల విత్తనాల అందుబాటుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతులకు పంటల ఎంపికపై జూన్ 1 నుంచే అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. నీటి పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించడంలో పాత్రికేయులు భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. వ్యవసాయ, వ్యవసాయ విస్తరణ, సాగునీటి శాఖల అధికారుల సూచనల మేరకు పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

# మందమర్రిలో అక్రమ ఫామ్ హౌస్..దుమారం!..





- 3 ఎకరాల భూమిపై అక్రమ నిర్మాణం!..
- 1/70 చట్టం ఉల్లంఘనపై ఫిర్యాదు..
- భూమి స్వాధీనం.. పేదలు, జర్నలిస్టులకు కేటాయింపు..
- అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు!..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 17 (సిరి న్యూస్)**

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణ శివారులో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఫామ్‌హౌస్ నిర్మాణం జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. అనుమతులు లేకుండా, గిరిజన భూముల రక్షణ కోసం ఉద్దేశించిన 1/70 చట్టాన్ని బాహాటంగా ఉల్లంఘిస్తూ సాగుతున్న ఈ నిర్మాణంపై పేదలు, జర్నలిస్టుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారంపై బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ సోమవారం సంచలన ఆరోపణలు గుప్పించారు..

**మూడు ఎకరాల భూమి...అక్రమార్కుల గుప్పిట్లో!..**

మందమర్రి పట్టణ శివారులోని సర్వే నంబర్ 347/2లో మూడు ఎకరాల 20 గుంటల విస్తీర్ణంలో ఎలాంటి అనుమతులు లేకుండా భారీ ఫామ్‌హౌస్ నిర్మాణం జోరుగా సాగుతోందని రాజేంద్రప్రసాద్ ఆరోపించారు. చట్టాన్ని పక్కనపెట్టి, అధికారుల కళ్లుగప్పి ఈ నిర్మాణం చేపడుతున్న వైనంపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇది కేవలం ఒక అక్రమ నిర్మాణం మాత్రమే కాదని, పేదల హక్కులను హరించి భూదాహంతో సాగుతున్న దోపిడీగా అభివర్ణించారు..

**భూమిని స్వాధీనం చేసి... పేదలు, జర్నలిస్టులకు కేటాయించాలి..**

ఈ నేపథ్యంలో సదరు భూమిని వెంటనే స్వాధీనం చేసుకుని, పట్టణంలోని పేదలకు, జర్నలిస్టులకు కేటాయించాలని రాజేంద్ర ప్రసాద్ గట్టిగా డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మందమర్రి మండల ప్రజావాణి నోడల్ అధికారి ఎన్. రాజేశ్వర్‌కు నేరుగా వినతిపత్రం సమర్పించారు. అక్రమ నిర్మాణాన్ని వెంటనే అడ్డుకుని, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు..

**విచారణ జరపాల్సిందే...**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన శిక్షలు తప్పవు!..**

భూమి వినియోగం, నిర్మాణానికి సంబంధించిన అనుమతుల వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. విచారణలో నిబంధనల ఉల్లంఘన రుజువైతే, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. ఎలాంటి రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్టపరంగా ముందుకెళ్లాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు..

**1/70 చట్టం అంటే ఏమిటి... ఎందుకీ ఆందోళన?..**

గిరిజన ప్రాంతాల్లో భూములు గిరిజనేతరుల చేతుల్లోకి వెళ్లకుండా రక్షణ కల్పించేందుకు ఉద్దేశించినదే 1/70 చట్టం. ఈ చట్ట పరిధిలోకి వచ్చే భూమిలో అనుమతులు లేకుండా భారీ నిర్మాణం చేపట్టడం తీవ్రమైన ఉల్లంఘనగా పరిగణించాల్సి ఉంటుందని రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఇలాంటి ఉల్లంఘనలను ఉపేక్షిస్తే భవిష్యత్తులో మరిన్ని అక్రమాలకు దారి తీసే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు..




**అధికారుల నిర్లక్ష్యంపైనా ప్రశ్నలు..బాధ్యులెవరు?..**

ఇంతటి భారీ నిర్మాణం జరుగుతున్నా సంబంధిత రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో నిఘా ఉంటే ఇంతటి నిర్మాణం ఇన్ని రోజులు కొనసాగేదే కాదని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ వ్యవహారంలో అధికారుల నిర్లక్ష్యం కూడా ఉందా అన్న కోణంలో విచారణ జరపాలని పలువురు కోరుతున్నారు..

**పేదల ఆశలపై నీళ్లు చల్లొద్దు..జర్నలిస్టుల డిమాండ్ కు మద్దతు..**

పట్టణంలో సొంత ఇళ్లు లేని పేదలు, స్థలం కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న జర్నలిస్టులు ఈ భూమి కేటాయింపు డిమాండ్‌ను స్వాగతిస్తున్నారు. అక్రమార్కుల చేతుల్లో భూమి ఉండిపోతే, అర్హులైన పేదలకు, జర్నలిస్టులకు తీరని అన్యాయం జరిగినట్లేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ డిమాండ్‌ను త్వరితగతిన పరిష్కరించాలని వారు కోరుతున్నారు..

**అధికారుల తదుపరి నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ!..**

ఈ ఫిర్యాదుపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని జిల్లా వ్యాప్తంగా సర్వత్రా ఆసక్తి నెలకొంది. క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, వాస్తవాలు నిగ్గుతేల్చాలని, అక్రమార్కులపై చట్టపరమైన కొరడా ఝుళిపించాలని పలువురు కోరుతున్నారు. ఈ వ్యవహారం ఎలాంటి మలుపు తిరుగుతుందోనని అందరి దృష్టి అధికారులపైనే కేంద్రీకృతమైంది.

# కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసే కుట్ర

## టిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి.

**రామాయంపేట, ఆగస్టు 17 (సిరి న్యూస్)**

పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రను మానుకోవాలని మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడపిల్లల వివాహ సమయంలో ఆర్థిక భరోసా కల్పించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయరాదన్నారు.ఈ పథకాల ద్వారా రాష్ట్రంలోని ఎంతోమంది పేద కుటుంబాలకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతోందని తెలిపారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన ఈ పథకానికి అదనంగా తులం బంగారం ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు కొనసాగుతున్న పథకాలను రద్దు చేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల విషయంలో హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయకుండా ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.పథకాల కొనసాగింపుపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని, వాటిని రద్దు చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పేదల సంక్షేమానికి ఉపయోగపడుతున్న పథకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించి లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించాలన్నారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అనేక హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని తిరుపతిరెడ్డి విమర్శించారు. పేదల సంక్షేమానికి సంబంధించిన పథకాలను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసే దిశగా వ్యవహరించడం తగదన్నారు. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే ఈ పథకాలను నిరంతరాయంగా కొనసాగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, కౌన్సిలర్లు కొక్కు ప్రవీణ్, చౌదరి చరిత, బీఆర్ఎస్ నాయకులు బసన్నపల్లి రాజు యాదవ్, మద్దెల రమేష్, ఎస్.కె. అహ్మద్, మెట్టు యాదగిరి, మద్దూరి భాను చందర్, గుడాల లింగం తదితరులు పాల్గొన్నారు.





# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- మండల స్థాయి ప్రజావాణికి చక్కటి స్పందన
- 17 అర్జీల స్వీకరణ సంబంధిత శాఖలకు పంపిన అధికారులు

**గుమ్మడిదల, ఆగస్టు 17 (సిరి న్యూస్ ):**



ప్రజా సమస్యలకు పరిష్కార మార్గం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా మండల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి చక్కటి స్పందన లభించింది. గుమ్మడిదల మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో సోమవారం మండల అభివృద్ధి అధికారి ఉమాదేవి అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి 17 అర్జీలను స్వీకరించినట్లు ఎంపీడీఓ ఉమాదేవి తెలిపారు. ప్రజలు అందజేసిన అర్జీలను పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు పంపించినట్లు పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశం, ఎంఈఓ మౌలీనా, విద్యుత్ శాఖ ఏఈ రవీందర్, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మధుకర్, ఏఈ అనూషతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తెల్లాపూర్‌లో రూ.48 కోట్లతో క్యూర్ అర్బన్ స్కూల్



- పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యం
- ఎకరా విస్తీర్ణంలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే ప్రాంగణంలో విద్యాబోధన
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**రామచంద్రాపురం, ఆగస్టు 17 (సిరి న్యూస్):**

తెల్లాపూర్‌లో పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు రూ.48 కోట్లతో క్యూర్ అర్బన్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 323లో పాఠశాల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఎకరా విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే ప్రాంగణంలో విద్యాబోధన కొనసాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థులకు డిజిటల్ తరగతి గదులు, ఆధునిక సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీ, విశాలమైన ఆటస్థలాలు తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందించడమే లక్ష్యమని, ఆర్థిక పరిస్థితులు విద్యార్థుల భవిష్యత్తుకు అడ్డంకిగా మారకూడదన్నారు. విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సృజనాత్మకతకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. తెల్లాపూర్, పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభాకు ఈ పాఠశాల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సోమిరెడ్డి, రాములు గౌడ్, దేవేందర్ యాదవ్, మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వీరభద్ర స్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన

## శ్రావణ సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు

**గుమ్మడిదల, ఆగస్టు 17 (సిరి న్యూస్ ):**



శ్రావణమాస ఉత్సవాలను పురస్కరించుకుని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీ ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా ఆలయంలో నిత్యం ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా భక్తులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. అమ్మవారికి కుంకుమార్చనతో పాటు వివిధ ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు నిర్వహిస్తున్నారు. శ్రావణ సోమవారం కావడంతో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల శివనామస్మరణతో సందడిగా మారింది.

# 14 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టుకున్న పోలీసులు

- నల్లగొండ జిల్లా నిడమనూరులో లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత
- రెండు రోజుల్లో రెండు సంఘటనలు

**నిడమనూరు, ఆగస్ట్17, సిరి న్యూస్:**

నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రంలో సోమవారం రేషన్ బియ్యాని అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ ఐ తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక మిల్లు వద్ద నుంచి బయటికి వచ్చిన లారీ( టీఎస్ 05 యుడీ. 6292)ని సోమవారం ఉదయం 9 గంటల సమయంలో అనుమానంతో పోలీసులు చెక్ చేశారు. లారీ పై టార్పాలిన్ కవర్ కప్పి ఉండగా, దానిని తొలగించి చూస్తే బియ్యం ఉన్నాయి. వాటికి సంబంధించి కాగితాలు అడిగితే లేవనే సమాధానం లారీ డ్రైవర్ నుంచి రావడంతో బియ్యాన్ని పరిశీలించగా అవి రేషన్ బియ్యంగా తేలింది. 14 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు తేలింది. అనుమతి లేకుండా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని, నిడమానూరు చెందిన డ్రైవర్ మర్రెపల్లి సైదయ్య ను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ కుమార్ తెలిపారు.

## రెండు రోజుల్లో రెండు సంఘటనలు...

ఆదివారం నాడు మండలంలోని నరసింహుల గూడెం వద్ద 850 కిలోల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను పట్టుకుని కేసు నమోదు చేశారు. వరుసగా రెండు రోజుల్లో రెండు సంఘటనలు పేదల బియ్యం పక్కదారి పడుతున్న వైనం బయట పడింది. ప్రభుత్వం మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి ఇస్తుండటంతో బియ్యం అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. ఇలాగే సరైన నిఘా పెట్టినట్లయితే పేదల బియ్యం పక్కదారి పట్టకుండా నిరోధించినట్లు అవుతుందని ప్రజలు భావిస్తున్నారు.

# 'సర్' జిల్లా ఓటర్ల జాబితా రెడీ

- మెదక్-34 నియోజకవర్గంలో 2,01705 మంది ఓటర్లు.
- నర్సాపూర్-37 నియోజకవర్గంలో 2,08499 మంది నమోదు.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

| | General Voters | | | | NRI Voters | | | | Service Voters | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| AC Name | Male | Female | Third Gender | Total | Male | Female | Third Gender | Total | Members | Wives | Total |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 34-Medak | 96184 | 105518 | 3 | 201705 | 4 | 1 | 0 | 5 | 80 | 1 | 81 |
| 37-Narsapur | 101376 | 107118 | 5 | 208499 | 1 | 0 | 0 | 1 | 36 | 2 | 38 |

**మెదక్ ఆగష్టు,17(సిరి న్యూస్)**



ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా 34-మెదక్,37-నర్సాపూర్ శాసనసభల నియోజకవర్గానికి సంబంధించి 01-10-2026ను తేదీని ప్రామాణికంగా రూపొందించిన సమీకృత ముసాయిదా ఫోటో ఓటర్ల జాబితా, సర్వీస్ ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సోమవారం ప్రకటించారు.

నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల నమోదు అధికారి, సహాయ ఓటర్ల నమోదు అధికారుల కార్యాలయాల నోటీసు బోర్డులపై ముసాయిదా ఓటర్ల జాబితాను ఓటర్లు పరిశీలనార్థం అందుబాటులో ఉంచినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

మెదక్ నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

పురుషులు

96,184, మహిళల ఓటర్లు, 105518,థర్డ్ జెండర్లు 03,మొత్తం

2,01705

మొత్తం ఓటర్లలో ఎన్ఆర్ఐ ఓటర్లు 5 మంది ఓటర్లు ఉన్నారని,వీరిలో 04మంది పురుషులు, ఒకరు మహిళ ఉన్నారని తెలిపారు.

అదేవిధంగా నియోజకవర్గంలో సర్వీస్ ఓటర్లు మొత్తం 81 మంది ఉండగా, వారిలో 80 మంది పురుషులు, 01 మంది మహిళలు ఉన్నారని వెల్లడించారు.

నర్సాపూర్ నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

పురుషులు 101376 మంది, మహిళలు107118, థర్డ్ జెండర్లు05 మొత్తం

2,08499 మొత్తం ఓటర్లలో ఎన్ఆర్ఐ ఓటర్లు 01 పురుషుడు ఉన్నారని, తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలో సర్వీస్ ఓటర్లు మొత్తం 38మంది ఉండగా, వారిలో పురుషులు36 మంది, మహిళలు 02 ఉన్నారని వెల్లడించారు. ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో ప్రతి ఓటరు తమ పేరు, చిరునామా వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రతిమా సింగ్ సూచించారు. ముసాయిదా జాబితాలో పేరు నమోదు కాకపోవడం, పేరుపై అభ్యంతరం ఉండటం, ఓటరు వివరాల్లో తప్పులు లేదా మార్పులు ఉన్నట్లయితే సెప్టెంబర్ 16, 2026వ తేదీలోగా నిర్దేశిత ఫారాల ద్వారా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేయాలని తెలిపారు. ఫారాల ద్వారా దరఖాస్తు

**ఫారం-6:** అర్హత కలిగిన కొత్త ఓటర్లుగా పేరు నమోదు చేసుకోవడానికి. **ఫారం-7:** ఓటర్ల జాబితాలోని పేరు లేదా నమోదుపై అభ్యంతరం తెలియజేయడానికి.

**ఫారం-8:** ఓటరు వివరాల్లో సవరణలు, మార్పులు చేసుకోవడానికి.

క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సంబంధిత ఎన్నికల నమోదు అధికారి కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం లేదా నిర్దేశిత కేంద్రాల్లో సమర్పించవచ్చని తెలిపారు. 01-10-2026వ తేదీ నాటికి18 సంవత్సరాలు నిండిన యువతతో పాటు ఓటరుగా నమోదు కావడానికి అర్హత ఉన్న ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు.

## కిరాణా దుకాణంలో ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

### అక్రమంగా నిల్వ చేసిన బియ్యం స్వాధీనం దుకాణ యజమానిపై కేసు నమోదు



**గుమ్మడిదల, ఆగస్ట్ 17 (సిరి న్యూస్):**

నిరుపేదలకు కడుపునిండా సన్నబియ్యంతో భోజనం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని ఓ కిరాణా దుకాణంలో అక్రమంగా నిల్వ చేసిన ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు గుమ్మడిదల మండల రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్ మల్లేశం, పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ వీరేశం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మదన్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం గుమ్మడిదలలో తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా నవీన్‌కు చెందిన కిరాణా దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సబ్సిడీపై రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్న విషయం తెలిసినప్పటికీ, కొంతమంది వ్యక్తులు రేషన్ దుకాణాల నుంచి బియ్యాన్ని రేషన్ కార్డు ద్వారా తీసుకొని ఇంట్లో వాటిని వినియోగించుకోకుండా అమ్మకాలకు పాల్పడుతున్నారు. వారి అవసరాలను ఆసరాగా తీసుకొని కిరాణా దుకాణాల యజమానులు వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలను అడ్డుకునేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని పటాన్‌చెరులోని ఎంఎల్ఎస్ గోదాముకు తరలించినట్లు అధికారులు తెలిపారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ ఉంచిన కిరాణా దుకాణ యజమానిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ ఉంచడం, విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వం పేదల కోసం అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ప్రజలు కూడా అధికారులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

# ఎల్లలు దాటేలా మెదక్ 'ఖిల్లా'ను అభివృద్ధి చేద్దాం







- ప్రముఖ పర్యాటక కేంద్రంగా మెదక్ ఖిల్లా.
- గనులు,భూగర్భ,ఉపాధి కార్మిక, పారిశ్రామిక శాఖల,ఇంచార్జి మంత్రి వివేక్ వెంకట స్వామి.
- మెదక్ ఖిల్లా పై ప్రత్యేక పోస్టల్ కవర్,స్టాంప్ ఆవిష్కరణ.
- కాకతీయుల రాజులే మెతుకుసీమగా నామకరణం చేశారు.
- స్వదేశీ దర్శన్ కార్యక్రమంతో ఖిల్లాను అభివృద్ధి చేస్తాం.
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు.

**మెదక్ఆ గష్టు,17(సిరి న్యూస్)**

మెదక్ పట్టణంలోని చారిత్రక మెదక్ ఖిల్లా పై ప్రత్యేక పోస్టల్ కవర్, స్టాంప్‌ను రాష్ట్ర పర్యాటక, బొగ్గు గనుల శాఖ మంత్రి, మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, మెదక్ ఎంపీ రఘునందన్ రావు,ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు,ఎమ్మెల్సీ అంజిరెడ్డి తో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ...మెదక్ ఖిల్లాకు ఎంతో చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. పురాతన కాలంలో నిర్మించిన మెదక్ ఖిల్లా పేరుతో ప్రత్యేక పోస్టల్ కవర్, స్టాంప్ విడుదల చేయడం అభినందనీయమని, ఇందుకు పోస్టల్ శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మెదక్ ఖిల్లాను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసి కృషి చేస్తాయని మంత్రి పేర్కొన్నారు. స్వదేశీ దర్శన్ ప్రాజెక్ట్ కింద ఖిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.కేంద్ర పర్యాటక శాఖ నుంచి నిధులు తీసుకువచ్చేందుకు ఎంపీ రఘునందన్ రావు కృషి చేయాలని సూచించారు.గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా మెదక్ జిల్లా ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని మంత్రి విమర్శించారు. మెదక్‌ను పర్యాటక రంగంలో మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్రానికి ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మెదక్ చర్చి అభివృద్ధికి రూ.30 కోట్ల నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు.మెదక్ జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాంతాలను అభివృద్ధి చేసి పర్యాటక రంగంలో జిల్లాకు మరింత గుర్తింపు తీసుకువస్తామని స్పష్టం చేశారు. కాకతీయ కాలంలోని మెతుకు సీమగా నామకరణం మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ..మెదక్ ప్రాచుర్యాన్ని గుర్తించి భారత తపాలా శాఖ ఆధ్వర్యంలో పోస్టల్ స్టాంప్ కవర్ ప్రారంభోత్సవం చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. స్టాంపు ఆవిష్కరణ సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలిపారు.పురాతన కట్టడంగా పేరొందిన ఈ కోట ప్రాచుర్యాన్ని గుర్తించి స్వదేశీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా ప్రాచీన కాలంలో కట్టిన కోటలు పరిరక్షణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం శుభ పరిణామంగా పేర్కొన్నారు.గతంలో కాకతీయ రాజుల కాలంలోనే మెతుకు సీమగా పేరొందిందన్నారు. మంజీరా పరివాహక ప్రాంతంలో పండిన వరి గింజలతో కాకతీయ రాజులకు అన్నం పెట్టేదని ఈ జిల్లాకు మెతుకు సీమ అని పిలవబడిందన్నారు. అనేక రాజకీయ కారణాలవల్ల ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు నిర్లక్ష్యాల వల్ల పూర్తిగా మెదక్ జిల్లా నిర్లక్ష్యానికి గురైందన్నారు.ఒక దశలో నిరాహార దీక్షలో కొట్లాడి మెతుకు సీమ జిల్లా కావాలనే దుస్థితి ఈ జిల్లా ప్రజలు నెట్టవేయబడ్డారని ఆవేదన వ్యక్తం చేస్తూ చివరగా మెదక్ జిల్లాను సాధించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,మెదక్ ఆర్డీవో రమదేవి,డిఎస్పి ప్రసన్న కుమార్ ,పోస్టల్ శాఖ అధికారి విజయ్,మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్,మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్






### జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి.

**మెదక్ ఆగష్టు,17(సిరి న్యూస్)**

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో దేశంలోనే తెలంగాణా నెంబర్ వన్ గా ఉన్నామని జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి పేర్కొన్నారు.మెదక్ లోని కలెక్టరేట్ కార్యాలయంలో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనం పల్లి రోహిత్ రావ్, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ లతో కలిసి సోమవారం మహిళలకు స్మార్ట్ కార్డులను పంపిణి చేశారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ప్రజా పాలనలో మహిళలకు అనేక కార్యక్రమాలు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని వైఎస్ హయంలో పావుల వడ్డీ రుణాలు ప్రారంభించారనీ గుర్తు చేశారు.రూ 23వేల కోట్ల రూపాయలు మహిళలకు రుణాలు అందించామని, ఈవీ వాహనాలను కూడా మహిళలకు అందిస్తున్నామన్నారు. మహిళలకు బస్సు ఫ్రీ సదుపాయం కల్పించింది రాష్ట్ర ప్రభుత్వం , పేదలకు సన్నబియ్యం ఇస్తుందన్నారు. పేద పిల్లలకు స్కూల్స్ లలో సన్న బియ్యంతో మంచి భోజనం పెడుతున్నాం అని,సంక్షేమ హాస్టల్ల విద్యార్థులకు మంచి భోజనం పెడుతున్నామన్నారు.త్వరలో విద్యార్థులకు ఫ్రీ టిఫిన్ పెడుతున్నామని, ప్రతి సంక్షేమ పథకం పేదలకు ఉపయోగ పడాలన్నదే ప్రజా ప్రభుత్వం సంకల్పం అన్నారు.గత ఏడాది మూడు వేల ఇందిరమ్మ ఇల్లు ఇచ్చామని,ఈ ఏడాది మరో 2500ఇల్లు ఇస్తున్నాం అని తెలిపారు.ఏ ఊరిలో పెంకుటిల్లు కనిపించవద్దన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ 10లక్షల వరకు వైద్యం అందిస్తున్నామని,విద్యా, వైద్యానికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు.రూ 200కోట్ల రూపాయలతో ఇంటిగ్రెటెడ్ స్కూల్స్,పబ్లిక్ స్కూల్స్ తరహా లో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ స్థాపిస్తున్నాం అని వివరించారు. పేదలకు ఉచితంగా 200యూనిట్ల కరెంట్ ఇస్తున్నామని,స్మార్ట్ కార్డు లలో ఫ్యామిలీ డిటైల్స్ దేశంలో ఎక్కడ అమలు చేయడం లేదన్నారు.గతంలో రేషన్ కార్డులలో అవకతవకలు జరుగుతుండే కానీ ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదనీ స్పష్టం చేశారు.భూగర్భ గనుల శాఖ ద్వారా రూ 1000కోట్ల ఆదాయం తెచ్చామన్నారు.మహిళలకు 2500 ఇస్తామని మాట ఇచ్చామో ఇచ్చి తీరుతాం అని పునరుద్ఘాటించారు.తెలంగాణలో ఆర్థిక పరిస్థితి బాగుచేసేందుకు సీఎం రేవంత్ కృషి చేస్తున్నారన్నారు. మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టిందన్నారు . గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని తెలిపారు.ఇందిరమ్మ ప్రభుత్వంలో మహిళలకు మహాలక్ష్మి,పేదలకు సన్న బియ్యం, జీరో విద్యుత్, సబ్సిడీ సిలిండర్ లాంటి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, గ్రంధాలయాల చైర్మన్ సుహాసిని రెడ్డి, ట్రేని ఆర్డీవో అహ్మద్ మొహమ్మద్,మెదక్, రామయంపేట, తూప్రాన్ మున్సిపాలిటీల చైర్పర్సన్లు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ముసాయిదా ఓటరు జాబితా విడుదల

- ఓటర్లు వివరాలు పరిశీలించుకోవాలి
- సెప్టెంబర్ 16లోపు అభ్యంతరాలు దాఖలు చేయాలి
- గుమ్మడిదల తహసిల్దార్ పరమేశం



**గుమ్మడిదల, ఆగస్టు 17 (సిరి న్యూస్)**

గుమ్మడిదల మండల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ -2026 కార్యక్రమంలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించినట్లు గుమ్మడిదల తహశీల్దార్ పరమేశం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితాలను సంబంధిత పోలింగ్ కేంద్రాల్లోని బూత్ లెవల్ అధికారులు వద్ద ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఓటర్లు తమ పేరు, వయస్సు, చిరునామా, ఇతర వివరాలను జాబితాలో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ముసాయిదా జాబితాలో పేరు నమోదు కాకపోవడం, పేరులో లేదా ఇతర వివరాల్లో తప్పులు ఉండటం, అర్హత లేని వ్యక్తుల పేర్లు నమోదై ఉండటం వంటి అంశాలపై అర్హత కలిగిన వ్యక్తులు సెప్టెంబర్ 16 లోపు అభ్యంతరాలు దాఖలు చేయాలని కోరారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, జాబితా తప్పులు లేకుండా రూపొందించేందుకు ప్రజలు సహకరించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి ఓటరు తమ ఓటు హక్కుకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవాలని తహశీల్దార్ విజ్ఞప్తి చేశారు.

## వైభవంగా నాగుల పంచమి వేడుకలు



### ఆలయాలు, వ్యవసాయ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు

**గుమ్మడిదల, ఆగస్టు 17 (సిరి న్యూస్ ):**

గుమ్మడిదల పారిశ్రామిక ప్రాంతంలో నాగుల పంచమి పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. గుమ్మడిదల మండలంతో పాటు పురపాలక సంఘం పరిధిలోని వివిధ ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగుల పంచమి సందర్భంగా ఆలయాల సమీపంలోని పుట్టల వద్ద భక్తులు నాగదేవతలకు పాలు పోసి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు స్థానికులు తమ వ్యవసాయ పొలాల్లో ఉన్న పుట్టల వద్దకు వెళ్లి నాగదేవతలకు పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగ సందర్భంగా ఆలయాల వద్ద భక్తులతో సందడి నెలకొంది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నాగదేవతలకు పూజలు చేసి కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.

www.siridaily.com
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్తపత్రిక
మంగళవారం
ఆగస్టు-18-2026
సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 217
MEDAK, SANGAREDDY, SIDDIPET
పేజీలు : 5

## పాస్పోర్ట్ సేవా కేంద్రంగా సంగారెడ్డి హెడ్ పోస్ట్ ఆఫీస్



సంగారెడ్డి, ఆగస్టు 17 (సిరి న్యూస్): సంగారెడ్డి హెడ్ పోస్ట్ ఆఫీస్ లో పాస్పోర్ట్ కేంద్రం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు విజ్ఞప్తి మేరకు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అలాగే మోడల్ పోస్ట్ ఆఫీస్ గా సంగారెడ్డి హెడ్ పోస్ట్ ఆఫీస్ నవీకరణ చేయనున్నారు. అంతే కాకుండా ప్రత్యేక పార్సిల్ యూనిట్ గా కూడా నవీకరణ చేయనున్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి, ప్రధాని నరేంద్ర మోడీకి ఎంపీ రఘునందన్ రావు ధన్యవాదాలు తెలిపారు.





## కాంగ్రెస్, బీఆర్ఎస్ హోరాహోరీ!

### తెల్లాపూర్‌లో ప్రభుత్వ పాఠశాల శంకుస్థాపనపై రసాభసా

- శిలాఫలకం, అధికారులు లేకుండానే తెల్లాపూర్ పాఠశాల శంకుస్థాపన
- అధికారిక కార్యక్రమమా లేక రాజకీయ ప్రచారమా అంటూ కాంగ్రెస్ నిలదీత
- ప్రొటోకాల్ నిబంధనలు గాలికొదిలేశారంటూ తీవ్రస్థాయిలో మండిపడిన కాంగ్రెస్ నేతలు
- కాంగ్రెస్ నిధులతో బీఆర్ఎస్ నేతలు డబ్బా కొట్టుకోవడం సరికాదన్న కొల్లూరి భరత్
- శంకుస్థాపన వేదికగా 'జై కేసీఆర్', 'జై రేవంత్' నినాదాలు
- పాఠశాల నిధుల మంజూరుకు కృతజ్ఞతగా సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం

3

సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి చేపట్టిన శంకుస్థాపన కార్యక్రమం తీవ్ర రాజకీయ రగడకు దారితీసింది. శంకుస్థాపనకు సంబంధించిన అధికారిక శిలాఫలకం లేకుండా, అలాగే సంబంధిత శాఖల అధికారులు కూడా లేకుండానే కార్యక్రమం నిర్వహించడంపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అసలు ఇది అధికారిక కార్యక్రమమా లేక రాజకీయ కార్యక్రమమా అంటూ వారు అధికారులను, నిర్వాహకులను సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమానికి సంబంధించిన కనీస ప్రోటోకాల్‌ను కూడా పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై కాంగ్రెస్ శ్రేణులు వేదిక వద్దే నిలదీశాయి.

రామచంద్రపురం, ఆగస్టు 17 (సిరి న్యూస్)




2

గుమ్మడిదలలో 100 పడకల

## ఆసుపత్రికి వెంటనే నిధులు మంజూరు చేయాలి

రూ. 56 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం
నిర్మాణ పనులు ప్రారంభించాలని మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి

## ప్రమాదాల నివారణకు వై జంక్షన్ పూర్తిస్థాయి మూసివేత

- కోమటిపల్లి, గొల్పర్తి గ్రామాల ప్రజలు సర్వీసు రోడ్డు ను ఉపయోగించుకోవాలి
- రామాయంపేట మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా
- భారతీయ జనతా పార్టీ హర్షం



2



## కేసిఆర్ పథకాలను రద్దు చేస్తే రణరంగమే

- కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేసే ప్రయత్నం చేస్తుంది
- పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రుల కష్టాలను ప్రత్యక్షంగా చూసిన కేసిఆర్ ఈ పథకాలను అమలుచేసిండు
- నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహన లేక ప్రజలతో చెలగాటమాడుతున్నారు
- యాప్ ల పేరా రైతులకు యూరియా అందించడంలో పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యింది
- చట్టబద్ధత కోసం హైకోర్టులో కళ్యాణలక్ష్మి పథకంపై కేసువేస్తే,కాంగ్రెస్ ప్రభుత్వం తడిబట్టవేసుకోని కాలయాపన చేస్తుంది
- కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను రద్దుచేస్తే తెలంగాణ రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుంది
- కాంగ్రెస్ ప్రభుత్వం పై నిప్పులుచెరిగిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి

5



మెదక్ , ఆగష్టు,17(సిరి న్యూస్) పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రుల కష్టాలను ప్రత్యక్షంగా చూసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టి ఎంతో మంది కుటుంబాలకు అండగా నిలిచారని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. పేదల సంక్షేమానికి ఉపయోగపడుతున్న ఈ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసే ప్రయత్నాలు చేస్తోందని ఆమె ఆరోపించారు. సోమవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీ ఎత్తున మెదక్ నియోజక వర్గ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో రాస్తారకో, ధర్నా కార్యక్రమం చేపట్టారు.



# ప్రమాదాల నివారణకు వై జంక్షన్ పూర్తిస్థాయి మూసివేత

- ఎమ్మెల్యే ఆదేశాలతో కదిలిన యంత్రాంగం.. ఎమ్మెల్యే రోహిత్ రావుకు ధన్యవాదములు
- చర్యలు ప్రారంభించిన మున్సిపల్ పాలకవర్గం
- కోమటిపల్లి, గొల్పర్తి గ్రామాల ప్రజలు సర్వీసు రోడ్డు ను ఉపయోగించుకోవాలి
- రామాయంపేట మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా
- భారతీయ జనతా పార్టీ హర్షం
- ఎంపీ మాధవనేని రఘునందన్ రావు కృషికి అభినందనలు



**రామాయంపేట, ఆగస్టు 17 (సిరి న్యూస్)** రామాయంపేట బైపాస్ వద్ద (ఆద్య హోటల్ ఎదురుగా) ఎట్టకేలకు వై జంక్షన్ రోడ్డు మూత పడింది. ప్రమాదాలకు నిలయంగా మారిన వై జంక్షన్ ను పూర్తిగా మూసివేయాలని ఒక వైపు అధికార పార్టీ ఎమ్మెల్యే ఒత్తిడి, మరోవైపు బిఆర్ఎస్, భారతీయ జనతా పార్టీ నాయకులు చేసిన ఆందోళనల దరిమిలా నేషనల్ హైవే అధికారులు సోమవారం నాడు పూర్తిగా సిమెంట్ గద్దెలతో ముసివేశారు. దీంతో ప్రజలతో పాటు, ఆయా పార్టీల నాయకులు ఊపిరి పీల్చుకున్నారు. మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు చేసిన కృషికారణంగానే వై జంక్షన్ రోడ్డు మూత పడిందని అధికార పార్టీ నాయకులు చెబుతుండగా, అదేమీ లేదు తమ ఒత్తిడి, ఆందోళనల నేపథ్యంలో హైవే అధికారులు దిగివచ్చి రోడ్డు ను మూసి వేశారని బిజెపి, బిఆర్ఎస్ నాయకులు వ్యాఖ్యానించారు. ఏది ఏమైనా రామాయంపేట నేషనల్ హైవే44పై వై జంక్షన్ వద్ద వరుసగా జరుగుతున్న ప్రమాదాల నివారణ కోసం అన్ని పార్టీలు చేపట్టిన సుదీర్ఘ పోరాటం ఫలించింది. ప్రమాదాల నివారణలో భాగంగా వై జంక్షన్‌ను పూర్తిస్థాయిలో మూసివేయడంపై భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్, బిఆర్ఎస్ హర్షం వ్యక్తం చేశారు. గత కొంత కాలంగా వై జంక్షన్ వద్ద జరుగుతున్న ప్రమాదాలపై భారతీయ జనతా పార్టీ రామాయంపేట ఆధ్వర్యంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, జంక్షన్‌ను మూసివేసి శాశ్వత ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సుదీర్ఘంగా పోరాటం చేసిందని, ఈ సమస్యను మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ప్రత్యేకంగా దృష్టిలోకి తీసుకుని, నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి వెంటనే ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించడం అభినందనీయమని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ శంకర్ గౌడ్ తెలిపారు.

అధికారులు వెంటనే స్పందించి వై జంక్షన్‌ను పూర్తిస్థాయిలో మూసివేయడం ప్రజల భద్రతకు ఎంతో కీలకమైన చర్య. ఈ చర్యతో భవిష్యత్తులో ప్రమాదాలను గణనీయంగా నివారించే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తమ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి నాయకత్వంలో చేసిన సుదీర్ఘ పోరాటానికి ఇది ఒక విజయమని, వై జంక్షన్ మూసివేత నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు రామాయంపేట పి ఎస్ సి చైర్మన్ బాధే చంద్రం తెలిపారు అదేవిధంగా, భవిష్యత్తులో కూడా నేషనల్ హైవేపై ప్రజల భద్రతకు అవసరమైన అన్ని శాశ్వత చర్యలను వేగంగా పూర్తి చేయాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులను ప్రజలు కోరుతున్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంతోనే
# నిండు గర్భిణి అనిత మృతి

- బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలి
- ఆసుపత్రి సిబ్బంది, డ్యూటీ డాక్టర్‌పై విచారణ జరిపాలి
- బాధిత కుటుంబానికి రూ. 25 లక్షల నష్టపరిహారం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి
- ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు మైసగళ్ల బుచ్చెంద్ర మాదిగ

**సంగారెడ్డి, సిరి న్యూస్:** సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే నిండు గర్భిణి భైరి అనిత మృతి చెందారని, ఆ కుటుంబానికి ప్రభుత్వం తక్షణ మే న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు మైసగళ్ల బుచ్చెంద్ర మాదిగ డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం చౌటకూర్ మండలం బద్రిగూడెం గ్రామంలో మృతి చెందిన నిండు గర్భిణి భైరి అనిత కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇంచార్జ్ పూర్ర సంతోష్ మాదిగ అధ్యక్షతన సందర్శించి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఆసుపత్రి సిబ్బంది తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మైసగళ్ల బుచ్చెంద్ర మాదిగ మాట్లాడుతూ.. నిండు గర్భిణి భైరి అనిత గత ఆగస్టు 10న సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఆగస్టు 12న మృతి చెందారని ఆరోపించారు. అందోల్





నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా ఉన్న శ్రీ దామోదర్ రాజనర్సింహ ఈ ఘటనపై స్పందించకపోవడం, గ్రామానికి వచ్చి కుటుంబాన్ని పరామర్శించకపోవడం బాధాకరమన్నారు. అనిత మృతితో ఆమె కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై ఆసుపత్రి సిబ్బంది, డ్యూటీ డాక్టర్లపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి బాధిత కుటుంబానికి రూ. 25 లక్షల నష్టపరిహారంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అందోల్ నియోజకవర్గం ఇంచార్జ్ సంతోష్ కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు, ఎంఎస్‌పీ జిల్లా నాయకులు గందగల్ల వీరయ్య మాదిగ, కొండాపూర్ మండల ఇంచార్జ్ కందుకూరి వినయ్, మునిపల్లె మండల కోఆర్డినేటర్ జంగం నవీన్, రాజు పాల్గొన్నారు.



## గుమ్మడిదలలో 100 పడకల
# ఆసుపత్రికి వెంటనే నిధులు మంజూరు చేయాలి

**రూ. 56 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం**

**నిర్మాణ పనులు ప్రారంభించాలని**

**మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి**



**గుమ్మడిదల, ఆగస్ట్ 17( సిరి న్యూస్):** గుమ్మడిదల ప్రాంతంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. పారిశ్రామిక ప్రాంతంగా గుమ్మడిదల శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. గుమ్మడిదలలో ఆసుపత్రి అవసరంపై 'సిరి' దినపత్రికలో 'పరిశ్రమలు పెరుగుతున్నాయి.. ఆసుపత్రి మాత్రం ఎక్కడ?' అనే శీర్షికన ప్రచురించిన కథనానికి మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ స్పందించి పలు వివరాలు వెల్లడించారు. గత ఏడాది రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి గుమ్మడిదలలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. తన విజ్ఞప్తిపై స్పందించిన మంత్రి, అప్పటి జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఆసుపత్రి నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించడంతో పాటు అవసరమైన అంచనాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు స్థల పరిశీలన నిర్వహించి, ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన అంచనాలను రూపొందించినట్లు చెప్పారు. రూ.56 కోట్ల అంచనా వ్యయంతో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను వెంటనే ఆమోదించి నిధులు మంజూరు చేయడంతో పాటు నిర్మాణ పనులను ప్రారంభించాలని కోరారు. గుమ్మడిదల పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందడంతో పాటు జాతీయ రహదారి సమీపంలో ఉండటం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ప్రమాదాలు జరిగిన సమయంలో క్షతగాత్రులకు సకాలంలో అత్యవసర వైద్యం అందించేందుకు సమీపంలో తగిన ప్రభుత్వ వైద్య సదుపాయాలు లేకపోవడం తీవ్ర సమస్యగా మారిందన్నారు. సకాలంలో వైద్యం అందక బాధితులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని, కొన్ని సందర్భాల్లో చికిత్స ఆలస్యమై ప్రాణనష్టం సంభవించే పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామిక ప్రాంతంలో పని చేస్తున్న కార్మికులు, స్థానిక ప్రజలు, జాతీయ రహదారిపై ప్రయాణించే వారికి 100 పడకల ఆసుపత్రి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ అంశంపై ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ఆరోగ్యశాఖ మంత్రి ప్రత్యేక దృష్టి సారించి రూ.56 కోట్ల ప్రతిపాదనలకు త్వరితగతిన ఆమోదం తెలిపి నిధులు మంజూరు చేయాలని చైర్మన్ విజ్ఞప్తి చేశారు.

సిరి ఎఫెక్ట్





# కాంగ్రెస్, బీఆర్ఎస్ హోరాహోరీ!

## తెల్లాపూర్‌లో ప్రభుత్వ పాఠశాల శంకుస్థాపనపై రసాభసా



సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి చేపట్టిన శంకుస్థాపన కార్యక్రమం తీవ్ర రాజకీయ రగడకు దారితీసింది. శంకుస్థాపనకు సంబంధించిన అధికారిక శిలాఫలకం లేకుండా, అలాగే సంబంధిత శాఖల అధికారులు కూడా లేకుండానే కార్యక్రమం నిర్వహించడంపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అసలు ఇది అధికారిక కార్యక్రమమా లేక రాజకీయ కార్యక్రమమా అంటూ వారు అధికారులను, నిర్వాహకులను సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమానికి సంబంధించిన కనీస ప్రోటోకాల్‌ను కూడా పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై కాంగ్రెస్ శ్రేణులు వేదిక వద్దే నిలదీశాయి.

రామచంద్రపురం, ఆగస్టు 17 (సిరి న్యూస్)

- శిలాఫలకం, అధికారులు లేకుండానే తెల్లాపూర్ పాఠశాల శంకుస్థాపన
- అధికారిక కార్యక్రమమా లేక రాజకీయ ప్రచారమా అంటూ కాంగ్రెస్ నిలదీత
- ప్రొటోకాల్ నిబంధనలు గాలికొదిలేశారంటూ తీవ్రస్థాయిలో మండిపడిన కాంగ్రెస్ నేతలు
- కాంగ్రెస్ నిధులతో బీఆర్ఎస్ నేతలు డబ్బా కొట్టుకోవడం సరికాదన్న కొల్లూరి భరత్
- శంకుస్థాపన వేదికగా 'జై కేసీఆర్', 'జై రేవంత్' నినాదాలు
- పాఠశాల నిధుల మంజూరుకు కృతజ్ఞతగా సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం

### రూ. 100 కోట్ల నిధులు ఇచ్చింది రేవంత్ సర్కారే

ఈ సందర్భంగా కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తెల్లాపూర్‌లో అత్యాధునిక ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి ఏకంగా రూ. 48 కోట్ల నిధులను కాంగ్రెస్ ప్రభుత్వమే మంజూరు చేసిందని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా తెల్లాపూర్ డివిజన్ పరిధిలో విద్యారంగానికి పెద్దపీట వేస్తూ, విద్యా సదుపాయాల కల్పన కోసం సుమారు రూ. 100 కోట్ల నిధులు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పనులు చేపడుతూ, బీఆర్ఎస్ నేతలు క్రెడిట్ కోసం డబ్బా కొట్టుకోవడం అత్యంత శోచనీయమని విమర్శించారు.

### సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

వివాదం అనంతరం కాంగ్రెస్ నాయకులు పాఠశాల నిర్మాణానికి రూ. 48 కోట్ల భారీ నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ కార్యక్రమాలను కేవలం తమ రాజకీయం కోసం వాడుకోకుండా, కచ్చితమైన నిబంధనల ప్రకారం నిర్వహించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలే తప్ప, ఇలాంటి చిల్లర రాజకీయాలకు దిగకూడదని హితవు పలికారు.

### రసాభాసగా మారిన సభ..

ప్రభుత్వ పాఠశాల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం కాస్తా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర రాజకీయ వివాదంగా మారడంతో అక్కడ స్వల్ప ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పరం నినాదాలు చేసుకుంటూ ముందడుగు వేయడంతో గందరగోళం ఏర్పడింది. నిబంధనలకు విరుద్ధంగా కార్యక్రమాలు నిర్వహిస్తే సహించేది లేదని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు.

### పనులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి

ఈ ప్రభుత్వ పాఠశాల నిర్మాణంతో తెల్లాపూర్ మరియు పరిసర ప్రాంతాల స్థానిక పేద విద్యార్థులకు ఎంతో మెరుగైన విద్యా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. రూ. 100 కోట్ల విద్యా నిధులతో తెల్లాపూర్ రూపురేఖలు మారబోతున్నాయని పేర్కొన్నారు. కాబట్టి రాజకీయ వివాదాలకు తావివ్వకుండా పాఠశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు, కాంట్రాక్టర్లను కోరారు.

### ఇరువర్గాల మధ్య.. నినాదాల హోరు

ఇంత పెద్ద మొత్తంలో నిధులు అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుర్తింపు ఇవ్వకుండా, బీఆర్ఎస్ నాయకులు ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని తమ సొంత ఘనతగా చెప్పుకోవడం సరికాదని కొల్లూరి భరత్ హితవు పలికారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను స్వార్థ రాజకీయ ప్రచారానికి వాడుకోవడం మానుకోవాలని డిమాండ్ చేశారు. శంకుస్థాపన జరుగుతున్న సమయంలో బీఆర్ఎస్ నాయకులు 'జై కేసీఆర్.. జై బీఆర్ఎస్' అంటూ నినాదాలు చేయగా, దానికి పోటీగా కాంగ్రెస్ నాయకులు 'జై కాంగ్రెస్.. జై రేవంత్ రెడ్డి' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.







# నమ్మకానికి ప్రతిరూపం శేరి

- ఘనంగా సుభాష్ రెడ్డి జన్మదిన వేడుకలు
- ఏడుపాయల అమ్మవారి సన్నిధిలో శశిధర్ రెడ్డి ప్రత్యేక పూజలు
- నియోజకవర్గవ్యాప్తంగా ఉత్సాహభరితంగా మాజీ ఎమ్మెల్సీ బర్త్‌డే సెలెబ్రేషన్స్
- తెలంగాణ ఉద్యమంలో అలుపెరుగని పోరాటం..
- ఎమ్మెల్సీగా రెండు పర్యాయాలు మెదక్ పట్టణ అభివృద్ధికి శ్రీకారం
- కార్యకర్తల కష్టసుఖాల్లో అండగా నిలిచే మెతుకుసీమ ముద్దుబిడ్డ

**కేసీఆర్ నమ్మకాన్ని గెలుచుకున్న నేత**



మెదక్, ఆగస్టు 17 (సిరి న్యూస్): తెలంగాణ మలిదశ ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేసి, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ నమ్మకాన్ని చురగొన్న నమ్మకానికి ప్రతిరూపం, మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర నాయకులు శేరి సుభాష్ రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు మెదక్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా, అంగరంగ వైభవంగా జరిగాయి. మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు, ముఖ్య నాయకులు కలిసి కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్లు ఆరేళ్ళ మల్లికార్జున్ గౌడ్, బట్టి జగపతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ మామీళ్ల ఆంజనేయులు, హవేలీ ఘనపూర్ మాజీ ఎంపీపీ శేరి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొని ఒకరికొకరు కేక్ తినిపించుకుని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. శేరి సుభాష్ రెడ్డి ఎమ్మెల్సీగా రెండు పర్యాయాలు మెదక్ పట్టణానికి, నియోజకవర్గానికి ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధిగా ఆయన అందించిన విశిష్ట సేవలు ఎనలేనివని గుర్తుచేసుకున్నారు. సామాన్య కార్యకర్తలను, స్థానిక నాయకులను సొంత మనుషుల్లా హక్కున చేర్చుకుని వారి కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా నిలిచే నిజమైన నాయకుడిగా శేరి గుర్తింపు పొందారని ప్రశంసించారు. సుభాష్ రెడ్డి ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించి మరిన్ని సంవత్సరాలు ప్రజలకు, పార్టీకి సేవలు అందించాలని వారు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

## పాపన్నపేటలో ప్రత్యేక పూజలు.. ఆసుపత్రిలో అన్నదానం

మాజీ శాసనమండలి సభ్యులు, మెతుకు సీమ ముద్దుబిడ్డ శేరి సుభాష్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పాపన్నపేట మండలంలో మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డిల ఆధ్వర్యంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గ భవాని అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుభాష్‌రెడ్డి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం అమ్మవారిని ప్రార్థించి, అనంతరం కేక్ కట్ చేశారు. అలాగే మెదక్ జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ ఆసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు, నిరుపేదలకు పౌష్టికాహారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## మండలాల వ్యాప్తంగా హోరెత్తిన వేడుకలు

మెదక్ నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని బర్త్‌డే వేడుకలను జరిపారు. హవేలి ఘనపూర్ మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ శేరి నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో, రామాయంపేట పట్టణ పార్టీ కార్యాలయంలో మాజీ మున్సిపాల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్ ఆధ్వర్యంలో, చిన్న శంకరంపేట మండలంలో మండల పార్టీ అధ్యక్షుడు పట్లోరి రాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగ నరేందర్ల ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మెదక్ పట్టణంలోని ఇంద్రపురి కాలనీ 5వ వార్డులో కాలనీ ప్రెసిడెంట్ గోపాల్ రావు ఆధ్వర్యంలో కాలనీవాసులు కేక్ కట్ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రంలోనూ శేరి సుభాష్ రెడ్డి జన్మదిన వేడుకలు పండుగ వాతావరణంలో నిర్వహించడం ఆయనపై నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఉన్న ప్రత్యేకమైన అభిమానానికి, ఆత్మీయ అనుబంధానికి నిదర్శనంగా నిలిచింది. ఈ జన్మదిన వేడుకల్లో మెదక్ మున్సిపల్ కౌన్సిలర్లు దీపక్ కుమార్, మాయ గంగమణి మల్లేశం, ఇంతియాజ్, ధర్మగల్ల సాయి, జుబేర్ అహ్మద్, నాయకులు గడ్డమీది కృష్ణ గౌడ్, ఆర్కే శ్రీనివాస్, లింగరెడ్డి, మోచి కిషన్, వనం వెంకటేష్, యువజన నాయకులు కసాపురం కిరణ్, చేదల అరుణ్, సంతోష్‌గౌడ్ పాల్గొని సందడి చేశారు. అలాగే ఘనపూర్ మండల మాజీ సర్పంచులు మేకల సాయిలు, శ్రీనివాస్ రెడ్డి, రమేష్ నాయక్, కొత్తపల్లి సాయిలు, యాదగౌడ్, మాజీ సర్పంచులు యామీ రెడ్డి, శ్రీను నాయక్, చిన్నగౌడ్, శ్రీహరి, సాయగౌడ్, కిషన్ నాయక్, మాజీ ఎంపీటీసీలు దుర్గారావు, శ్రీహరి, మండల నాయకులు రాజి రెడ్డి, సాప సాయిలు, చిరంజీవి రెడ్డి, రవీందర్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి, భాస్కర్, స్వామినాయక్, ప్రశాంత్, అశోక్, బాలాజీ రావు, రాజేందర్ రెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


















# కోమటిపల్లిలో రూ. 2.50 లక్షలతో ఉచిత వాటర్ ప్లాంట్

- ఎన్నికల హామీ మేరకు ఏర్పాటు.
- కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు సేవ చేస్తా
- రామాయంపేటకు రెండు ఫ్రీజర్లు త్వరలోనే అందిస్తా
- మహిళలు, యువత కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడతా
- బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాంటారెడ్డి తిరుపతిరెడ్డి
- తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

**రామాయంపేట, ఆగస్టు 17 (సిరి న్యూస్)** ప్రజలకు సేవ చేయడమే తన ప్రధాన లక్ష్యమని, కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు ప్రజా సేవలోనే కొనసాగుతానని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. రామాయంపేట మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు కోమటిపల్లిలో తన సొంత నిధులతో రూ.2.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలనే ఉద్దేశంతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరచిపోకుండా, ప్రజలకు అవసరమైన పనులను తనవంతుగా చేపడుతున్నానని చెప్పారు.

### రూ. 60 లక్షలతో సేవా కార్యక్రమాలు

మెదక్ నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు రూ.60 లక్షల సొంత నిధులను వెచ్చించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు కంటా రెడ్డి తిరుపతిరెడ్డి తెలిపారు. తాగునీటి కోసం వాటర్ ప్లాంట్ల ఏర్పాటు, విద్యార్థులకు నోట్ బుక్కుల పంపిణీ, ఆలయాల అభివృద్ధి, పాఠశాలల అభివృద్ధికి సహకారం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. భవిష్యత్తులోనూ ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని తెలిపారు. కోమిటిపల్లిలో రోడ్లు, మురుగు కాలువల సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని సూచించారు. రామాయంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ కోరిక మేరకు పట్టణానికి రెండు ఫ్రీజర్లు అందజేస్తామని తిరుపతిరెడ్డి హామీ ఇచ్చారు. అలాగే మహిళలు, యువత అభివృద్ధికి



త్వరలోనే ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. యువతకు అవకాశాలు, మహిళలకు అవసరమైన సహకారం అందించే దిశగా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్వకుంట గ్రామ సర్పంచ్ అందె కొండల్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, కౌన్సిలర్లు కొక్కు ప్రవీణ్, చౌదరి చరిత, బిఆర్ఎస్ నాయకులు నర్సారెడ్డి, బసన్నపల్లి రాజు యాదవ్, మద్దెల రమేష్, ఎస్.కె అహ్మద్, మెట్టు యాదగిరి, మద్దూరి భాను చందర్, గుడాల లింగం, విద్యాకర్ రాజు, పాతూరి సిద్ధరాములుతో పాటు పలువురు పాల్గొన్నారు.

# కేసిఆర్ పథకాలను రద్దు చేస్తే రణరంగమే

- కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేసే ప్రయత్నం చేస్తుంది
- పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రుల కష్టాలను ప్రత్యక్షంగా చూసిన కేసీఆర్ ఈ పథకాలను అమలుచేసిండు.
- నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహన లేక ప్రజలతో చెలగాటమాడుతున్నారు.
- యాప్ ల పేరా రైతులకు యూరియా అందించడంలో పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యింది
- చట్టబద్దత కోసం హైకోర్టులో కళ్యాణలక్ష్మి పథకంపై కేసువేస్తే,కాంగ్రెస్ ప్రభుత్వం తడిబట్టవేసుకోని కాలయాపన చేస్తుంది.
- కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను రద్దుచేస్తే తెలంగాణ రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుంది.
- కాంగ్రెస్ ప్రభుత్వం పై నిప్పులుచెరిగిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి





మెదక్ , ఆగష్టు,17(సిరి న్యూస్) పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రుల కష్టాలను ప్రత్యక్షంగా చూసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టి ఎంతో మంది కుటుంబాలకు అండగా నిలిచారని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. పేదల సంక్షేమానికి ఉపయోగపడుతున్న ఈ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసే ప్రయత్నాలు చేస్తోందని ఆమె ఆరోపించారు. సోమవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీ ఎత్తున మెదక్ నియోజక వర్గ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో రాస్తారకో, ధర్నా కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సరైన అవగాహన లేకుండా ప్రజలతో చెలగాటమాడుతోందని పద్మాదేవేందర్ రెడ్డి మండిపడ్డారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై స్పష్టత ఇవ్వకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు.ఈ పథకాలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ హైకోర్టులో కేసు వేస్తే, ప్రభుత్వం తడిబట్ట వేసుకుని కూర్చున్నట్లుగా వ్యవహరిస్తూ సమస్యను పరిష్కరించకుండా జాప్యం చేస్తోందని విమర్శించారు. అదేవిధంగా రైతులకు యూరియా అందించడంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆమె ఆరోపించారు. యాప్‌ల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం మానుకుని, వారికి అవసరమైన ఎరువులను సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు పేద కుటుంబాలకు ఎంతో భరోసానిస్తున్నాయని, వాటిని రద్దు చేయాలని చూస్తే తెలంగాణ రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని పద్మాదేవేందర్ రెడ్డి హెచ్చరించారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాలను స్పష్టం చేయాలని, సంక్షేమ పథకాలను యథావిధిగా కొనసాగించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ళ శశిధర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జ్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆరేళ్ళ మల్లిఖార్జున్ గౌడ్, రామాయంపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ గంగా నరేందర్, మెదక్ పట్టణ బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ గడ్డమీది క్రిష్ణా గౌడ్, న్యాయవాది జీవన్ రావు, మెదక్ పట్టణ బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ లు మామిండ్ల ఆంజనేయులు, మ్యాదరి దీపక్ కుమార్, సాయి, జుబేర్ అహ్మద్, మాయా గంగమణి మల్లేశం, రామాయంపేట బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ చరిత లతో పాటు మెదక్,రామాయంపేట,పాపన్నపేట, నిజాంపేట, శంకరంపేట మండలాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, రంగారావు లతో పాటు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గోన్నారు.

